# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

19.04.2026 ఆదివారం Sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 266 | పేజీలు : 13 Pages : 13 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









# మహిళా బిల్లు అడ్డుకోవడం ముమ్మాటికి భ్రూణహత్యే

**కాంగ్రెస్, ఎస్పీ, తృణమూల్, డీఎంకేలదే ఈ బాధ్యత**

- కుటుంబ పార్టీలతో మహిళలకు న్యాయం జరగదు
- అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరిగేలా సవరణ బిల్లు తెచ్చాం
- రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ దుష్ప్రచారం
- ఈ పాపం ఆ పార్టీలను వదిలి పెట్టదు.. మహిళా శక్తి ఊరుకోదు
- జాతిని ఉద్దేశించిన చేసిన ప్రసంగంలో మోదీ ఘాటు విమర్శలు

భారత నారీశక్తి ఎదగకుండా కాంగ్రెస్ తదితర విపక్షాలు అడ్డుకున్నాయని ప్రధాని మోదీ ఆక్షేపించారు. భారత మహిళల కలలను ధ్వంసం చేశారని విమర్శించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో.. దేశ ప్రజలను ఉద్దేశించి శనివారం మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఈ బిల్లును ఆమోదింపచేయకపోవడం తనకు బాధ కలిగించిందన్నారు. ఇది ముమ్మాటికీ భ్రూణ హత్యేనని అన్నారు. దేశ హితమే తమకు అత్యంత ముఖ్యమని, కొందరికి మాత్రం దేశం కంటే రాజకీయాలే ముఖ్యమని విమర్శించారు.

3



## రైతుభరోసా విడుదలకు సిద్ధం

రేపు కాటారాం సభలో విడుదల చేయనున్న రేవంత్

.. వివరాలు 2లో




## 26 వరకు వర్షాలు

- ఈదురుగాలులతో కూడిన వానలు
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్
- వాతావరణ శాఖ వెల్లడి

.. వివరాలు 3లో

## బొమ్మ కార్లతో పేలుళ్లకు ప్లాన్

నలుగురు అనుమానితుల అరెస్టు



.. వివరాలు 3లో



# మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు

## బిల్లు ముసుగులో డీలిమిటేషన్ చట్టం

### దక్షిణాదిని దెబ్బతీసే కుట్రను అడ్డుకున్నాం

- చిత్తశుద్ధి ఉంటే కేవలం మహిళా బిల్లు తేవాలి
- అందుకు ఇండి కూటమి మద్దతు ఇస్తుంది
- బీజేపీతో జతకట్టిన పార్టీలకు ఎదురుదెబ్బలు తప్పవు
- తెలుగు దేశం పార్టీకి కూడా ఆ ప్రమాదం ఉంది
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని పేర్కొన్నారు. మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓటమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా

మిగతా 2 లో



## బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

కుమారస్వామికి విజ్ఞప్తి చేసిన సీఎం రేవంత్

2

## హోర్ముజ్ జలసంధిలో హైటెన్షన్

- భారత ట్యాంకర్‌పై ఇరాన్ సైన్యం కాల్పులు!
- మళ్లీ మూతపడిన కీలక జలమార్గం..



4

## మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

- డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
- అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్

4



## రాహుల్ గాంధీకి ఊరట

పౌరసత్వ వివాదంలో ఎఫ్ఐఆర్ నమోదుపై స్టే

4

# పులి వస్తే.. ఎన్ని మేకలను మింగిందో బయటపెడతాం!

- కాళేశ్వరంలో ‘పులి’ ఏం చేసిందో ప్రజలకు వివరిస్తాం
- 20న అన్ని విషయాలు వెల్లడిస్తాం
- కేసీఆర్ జగిత్యాల సభపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సెటైర్లు
- మహిళా బిల్లు పతనం మోదీ అహంకారానికి చెంపపెట్టని విమర్శ





## ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

- పెదవి విప్పని తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ
- ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు
- రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్న హరీష్ రావు
- రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యిందన్న కేటీఆర్
- జగిత్యాలలో కేసీఆర్ ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలన

# కొత్త ఎయిర్‌పోర్ట్‌ల పనులు వేగవంతం చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం
- విమానాశ్రయాలపై ఉన్నతస్థాయి సమీక్ష
- వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు 953 ఎకరాల భూసేకరణ పూర్తి
- ఆదిలాబాద్‌కు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచన..
- కొత్తగూడెంపై నివేదిక కోరిన మంత్రి పొంగులేటి

రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుని వెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ క్రమంలో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసిందని అన్నారు.

2



నేటి సాక్షి
కరీంనగర్ | ఆదివారం 19 ఏప్రిల్ 2026



# స్కూల్ పరిసరాల్లో సిగరెట్, గుట్కా నిషేధం

## పాన్ షాపుల్లో పోలీసుల తనిఖీలు..హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** ఆపరేషన్ సేఫ్ స్కూల్ పేరుతో విద్యాసంస్థల దగ్గర ఉండే పాన్ షాపుల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్,స్పెషల్ టీం, ఎచ్ న్యూ మొత్తం 5000 మంది సిబ్బంది ఈ రైడ్స్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న 500కుపైగా పాన్ షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించ కూడదని సీపీ సజ్జనార్ ఆదేశించారు. అలా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు పాన్ షాప్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని.. తీరు మార్చుకోకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. స్కూలు పరిసరాలు పొగాకు రహితంగా ఉండాలని సూచించారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారని తమకు పలు ఫిర్యాదులు అందుతున్నాయని ప్రస్తావించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెంది తమకు ఫిర్యాదులు చేశారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. తమ పోలీస్ సిబ్బంది కూడా డికాయ్ ఆపరేషన్ నిర్వహించారని.. పొగాకు ఉత్పత్తులు స్కూల్ విద్యార్థులకు అమ్ముతున్నట్లు తమ విచారణలో తేలిందని చెప్పుకొచ్చారు. స్కూళ్ల వద్ద కొన్ని రోజుల నుంచి నిఘా పెట్టామని.. ఈరోజు ఐదు వేలమంది పోలీసులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. పొగాకు ఉత్పత్తులను విద్యార్థులు తీసుకోవడం మొదలుపెడితే.. డ్రగ్స్ వైపు మళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బ్యాన్ అయిన పాన్ మసాలాలు, గుట్కాలు వంటివి ఎవరైనా అమ్ముతున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. కొన్ని పాన్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న వస్తువులను సీజ్ చేశారు పోలీసులు. లోకల్ వస్తువులకు బ్రాండెడ్ ముద్ర వేసి అమ్ముతున్న కొన్నింటిని.. అదే విధంగా ఈ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్ హిల్స్ లోని ఓ పాన్ షాపులో ఈ సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

# తెలుగు రాష్ట్రాల నేతలకు కేంద్రమంత్రి అల్పాహార విందు

## హాజరైన సీఎం రేవంత్ సహా పలువురు నేతలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** తెలుగు రాష్ట్రాల నేతలకు ఆంధ్ర నుంచి కేంద్రమంత్రిగా ఉన్న భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆతిథ్యం ఇచ్చారు. శనివారం ఉదయం తెలుగు రాష్ట్రాల నేతలకు కేంద్ర మంత్రి అల్పాహార విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అల్పాహార విందులో ఎటువంటి రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు. డిసెంబర్ 9 నాటికి హైదరాబాద్ క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలని ఈవీ బస్సులు ఇవ్వాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపులు చేశామని.. త్వరలో అందజేస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ 2029 నుంచి అమలు చేసేందుకు ఒక ప్రయత్నం చేశామని.. కానీ విపక్షాలు వ్యతిరేకించాయన్నారు. 2029 నుంచే మహిళా రిజర్వేషన్ అమలు కావాలని ఆశిద్దామని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు. అల్పాహార విందుకు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కుమారస్వామి, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ బీజేపీ ఎంపీ లక్ష్మణ్ హాజరయ్యారు. ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు కూడా ఈ విందులో పాల్గొన్నారు.

# ఐపీఎస్‌ల బదిలీ

## 9 మందికి కొత్త బాధ్యతలు!

### జిల్లా అదనపు ఎస్పీలుగా యువ అధికారులకు ప్రమోషన్లు

### తక్షణమే అమల్లోకి రానున్న ఉత్తర్వులు..

### జిల్లాల వారీగా కొత్త పోస్టింగ్‌లు

**హైదరాబాద్, ఏప్రిల్19:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ యంత్రాంగంలో కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ సాధారణ పరిపాలన విభాగం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా ఏఎస్పీలుగా ఉన్న పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ జిల్లా అదనపు ఎస్పీలుగా (అడ్మిన్) బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. ఆసిఫాబాద్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎస్. చిత్తరంజన్‌ను అదే జిల్లాకు అదనపు ఎస్పీగా (అడ్మిన్) నియమించారు. కామారెడ్డి ఏఎస్పీ బొక్కా చైతన్య రెడ్డి సంగారెడ్డి అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు. జంగావ్ ఏఎస్పీగా ఉన్న పందేరే చేతన్ నితిన్‌ను జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా (అడ్మిన్) నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్‌ను మెదక్ జిల్లాకు బదిలీ చేయగా, వరంగల్ ఏఎస్పీ నగ్రాలే శుభమ్ ప్రకాశ్‌ను నిజామాబాద్ జిల్లా అదనపు ఎస్పీగా (అడ్మిన్) నియమించారు. భైంసా ఎస్డీపీఓగా పనిచేస్తున్న రాజేష్ మీనా వనపర్తికి బదిలీ అయ్యారు. ఆదిలాబాద్‌లో ఉన్న మౌనికను అదే జిల్లాలో అదనపు ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిర్మల్ ఏఎస్పీ పథిపాక సాయికిరణ్‌ను భైంసా ఎస్డీపీఓగా, వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టేను ఉట్నూరు ఎస్డీపీఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని, సంబంధిత అధికారులు వెంటనే తమ కొత్త బాధ్యతలను స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు జిల్లా స్థాయి పోలీస్ పరిపాలనను మరింత బలోపేతం చేసే దిశగా ఈ మార్పులు జరిగినట్లు తెలుస్తోంది.

# మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు

మొదటి పేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. అయితే మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ప్రధాని మోదీ.. ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాకు చిత్తశుద్ధి ఉంది. 2023 నాటి మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి. ఆ బిల్లు పెడితే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ నిజాయితీగా తీసుకురాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని.. దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక్ సభ సాక్షిగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ ఓడిపోయిందన్నారు. ఇది రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాల ఓటమి అంటూ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణలతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని రేవంత్ అన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకే బీజేపీ కుట్ర చేసిందని.. బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని



మార్చేవారని తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాలపై బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2023 మహిళా బిల్లును యథాతథంగా అమలు చేయాలని బీజేపీకి సూచించారు. అలా చేస్తే ఇండి కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకువచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా రేవంత్ హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉందని, యూపీ ఎన్నికల్లోపు వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. దీంతో ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలోనే తేలుతుందని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బిల్లును అడ్డుకోకుంటే డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేవారని ధ్వజమెత్తారు. నార్త్, సౌత్ మధ్య అంతరాలు పెట్టే విధానం ఇకనైనా మార్చుకో వాలని బీజేపీకి సీఎం రేవంత్ రెడ్డి హితవుపలికారు. ఇకపోతే బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల మనగడ భవిష్యత్తులో కష్టంగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్, ఏక్ నాథ్ షిండేలా పరిస్థితి మనం ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో సీట్లు తక్కువగా ఉన్నాయి కాబట్టి టీడీపీకి ఇంపార్టెన్స్ ఇస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమేనని చెప్పుకొచ్చారు. వాటిని ఇంప్లిమెంట్ చేసేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు అధికార యంత్రాంగమని తెలిపారు. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమని పేర్కొన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తనకు రాజుగా 2/ 3 మెజార్టీతో చట్టం చేసుకుంటే ఒప్పుకోరు కదా అని ప్రశ్నించారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరని చెప్పారు. ఏపీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే ఉన్నాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

- కుమారస్వామికి విజ్ఞప్తి చేసిన సీఎం రేవంత్
- ప్రియాంకను కలిసి బిల్లును ఓడించినందుకు అభినందనలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఉక్కు కొరత తగ్గడంతోపాటు.. పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం వివరించారు. పాత వాహనాల స్క్రాప్‌ను రీసైక్లింగ్ చేసే పరిశ్రమను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్‌ను కాలుష్యం లేని నగరంగా మార్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో బిజీబిజీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర పారిశ్రామిక విజన్ డాక్యుమెంట్‌ను కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రం ఏర్పాటుకు విన్నవించారు. ఆటో, రక్షణ రంగాల ఉత్పత్తులు, రోబోటిక్స్ తయారీకి ప్రత్యేక పార్కుల కోసం ప్రతిపాదించారు ముఖ్యమంత్రి. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కేంద్రం సహకారం కోరారు. ఆధునిక పరిశ్రమలకు అనుగుణంగా జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కుమార స్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ప్రియాంకకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు విషయాలను ప్రియాంక



గాంధీ బయటపెట్టారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల తరఫున రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు ధన్యవాదాలు తెలియజేశారు. 'దక్షిణాది రాష్ట్రాలను ఏకీకృతం చేయడంలో నా కృషిని ప్రియాంక గాంధీ అభినందించారు' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.




# రెండోవిడత రైతుభరోసా విడుదలకు సిద్ధం

## రేపు కాటారాం సభలో విడుదల చేయనున్న రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణ రైతులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా'పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. వానాకాలం సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సీఎం నిర్ణయించారు. భూపాలపల్లి జిల్లా కాటారంలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. బటన్ నొక్కి నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదును జమ చేయనున్నారు. రెండో విడత నిధుల విడుదల ద్వారా రాష్ట్రంలోని మెజారిటీ రైతులకు లబ్ది చేకూరనుంది. ప్రతి ఎకరానికి రూ. 6,000 చొప్పున పెట్టుబడి సాయం అందనుంది. ఈ విడతలో 45,11,947 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 కోట్ల ఎకరాలకు ఈ సాయం వర్తించనుంది. ప్రభుత్వం రైతు భరోసా కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. దీనికి సంబంధించిన గణాంకాలు కింది విధంగా ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం రూ. 3,590 కోట్లను రైతుల ఖాతాల్లో సక్సెస్‌ఫుల్‌గా జమ చేసింది. 20వ తేదీన రూ. 5,653 కోట్లు జమ కానున్నాయి. మొత్తం 73 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. మిగిలిన రైతుల కోసం మూడో విడత నిధులను విడుదల చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఈ నగదు అందడం వల్ల రైతన్నలకు వడ్డీ వ్యాపారుల భారం తప్పుతుంది. నిధులు సకాలంలో అందడం వల్ల అన్నదాతలు సాగు పనులను వేగవంతం చేసే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చే క్రమంలో రైతు భరోసా నిధుల విడుదలకు ప్రాధాన్యం ఇస్తోంది. కాటారం సభ వేదికగా జరగనున్న ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యవసాయ రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపనుంది.

# కొత్త ఎయిర్‌పోర్ట్‌ల పనులు వేగవంతం చేయాలి


### మంత్రి పొంగులేటి ఆదేశం.. విమానాశ్రయాలపై ఉన్నతస్థాయి సమీక్ష

### వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు 953 ఎకరాల భూసేకరణ పూర్తి.. త్వరలోనే శంకుస్థాపన

### ఆదిలాబాద్‌కు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచన..

## కొత్తగూడెంపై నివేదిక కోరిన మంత్రి

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుని వెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ క్రమంలో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసిందని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌ల నిర్మాణం వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన భూ సేకరణ, సాంకేతిక అనుమతులు, మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్ కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి తదితరులతో కలిసి వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఎయిర్ పోర్ట్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేందప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. వరంగల్ ఎయిర్ పోర్ట్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిందని తెలిపారు. వీలైనంత త్వరలో శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. అలాగే ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని డిఫెన్స్ (రక్షణ శాఖ) సివిల్ ఏవియేషన్ (పౌర విమానయాన శాఖ) , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాయని ఇందుకు సంబంధించి మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపిన నేపథ్యంలో దీనిపై మరింత లోతైన అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై ఒక నివేదిక రూపొందించాలని సూచించారు.



# తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

- పెదవి విప్పని తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ
- ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు
- రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్న హరీష్ రావు
- రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యిందన్న కేటీఆర్
- జగిత్యాలలో కేసీఆర్ ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలన



**జగిత్యాల, ఏప్రిల్ 18:** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్సభలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్రావు మాట్లాడారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ఏం లాభమని అన్నారు. బీజేపీ ఎంపీ బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరాన్ని దెబ్బ తీసిన ఎంపీ విషయంలో బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని వెల్లడించారు. బడేబాయి, చోటే బాయి బంధం మరో సారి బయటపడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్లో లేని లోటు నిన్న స్పష్టంగా కన్పించిందని హరీష్రావు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల మీద విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారత్ - పాక్ విభజనతో తెలంగాణ ఏర్పాటును పోల్చుతారా అంటూ మాజీ మంత్రి మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసిందన్నారు. పార్లమెంట్లో బిల్లు పాస్ అయి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని హరీశ్ రావు తెలిపారు. ఎంపీ తప్పు మాట్లాడితే.. క్షమాపణ చెప్పాల్సింది పోయి వెనుకేసుకుని వస్తున్నారని మండిపడ్డారు. లోక్ సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోందన్నారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పెదవులు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. తేజస్వి సూర్య మూతి పగిలే సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారన్నారు. మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాటకామాడుతున్నాయని విమర్శించారు. ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఖండించలేదని,రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని, దానికి నిదర్శనం బీఆర్ఎస్లో జీవన్ రెడ్డి చేరిక అని స్పష్టం చేశారు. రాజకీయల్లో విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని కొనియాడారు.మహిళా బిల్లును డీలిమిటేషన్తో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మెజారిటీ లేకున్నా బిల్లు పెడతారా అని నిలదీస్తూ.. రాజకీయం కోసమే బిల్లు ప్రవేశపెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్లో చేరబోతున్న సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం కనిపిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న కేసీఆర్ ' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను మాజీ మంత్రి హరీష్రావు, కొప్పుల ఈశ్వర్ , ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పునారేకీకరణ జరుగుతుందని వెల్లడించారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని, జగిత్యాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని దీమాను వ్యక్తం చేశారు.కేసీఆర్ బయటకు వస్తే గుంట నక్కలు బయపడుతున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ జగిత్యాలలో సభ ఉంటే మేడి గడ్డలో రేవంత్ సభ ఏర్పాటు చేసుకున్నాడని విమర్శించారు. రేవంత్ హైట్లో చిన్న అనుకున్న. కానీ రేవంత్ది చిన్న మెదడని, ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే హై బ్రిడ్, క్రాస్ బ్రిడ్ ఎమ్మెల్యేనా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ సభ విజయవంతమవుతుందని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని అన్నారు. ఈనెల 20న కేసీఆర్ సాయంత్రం 5,30 నిముషాలకు చేరుకుంటారని వివరించారు. సుమరు గంట సేపు కేసీఆర్ సభ ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.

# రాష్ట్రంలో 26 వరకు వర్షాలు

**ఈదురుగాలులతో కూడిన వానలు..**

**పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్**

**వాతావరణ శాఖ వెల్లడి**



**హైదరాబాద్, ఏప్రిల్18:** ఎండలతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. రాష్ట్రంలో ఈనెల 26వ తేదీ వరకు పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనంతో పాటు క్యూములోనింబస్ మేఘాలు ఏర్పడటం వల్ల ఈ వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ మరియు కామారెడ్డి జిల్లాల్లో వానలు పడతాయని తెలిపారు. గాలిలో తేమ శాతం పెరగడం, మేఘాల కదలికల వల్ల ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకున్న ఈ మార్పులు కేవలం ఒక రోజుకే పరిమితం కాకుండా, నేడు కూడా కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. రేపు కూడా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు తమ ధాన్యం మరియు పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# డీలిమిటేషన్కు మహిళా బిల్లు ముసుగు

**దక్షిణాదిని దెబ్బతీసే కుట్ర విఫలం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్, ఏప్రిల్ 18:** నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పార్లమెంట్లో దక్షిణ భారతదేశ ప్రాధాన్యాన్ని తగ్గిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఇప్పటికే 2023లో ఆమోదించిందని, ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు. నియోజక వర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకున్నా, తాజా జనాభా గణనను ప్రాతిపదికగా తీసుకున్నా దక్షిణ భారతదేశం తీవ్రంగా నష్టపోతుందని కేటీఆర్ అన్నారు. ఈ విషయం కేంద్రంలోని పాలకులకు కూడా బాగా తెలుసని చెప్పారు. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని తాజా బిల్లు పొందలేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, మోదీ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశ గళాన్ని అణచివేస్తున్న తీరుపై బిఆర్ఎస్ తరపున తాము తీవ్ర ఆందోళనను, నిరసనను వ్యక్తంచేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందింది కాబట్టి, ఈ దేశ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మహిళా రిజర్వేషన్ను అమలు చేయాలనుకుంటే ప్రస్తుతం ఉన్న 543 స్థానాలతోనే అమలు చేయవచ్చని చెప్పారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశానికి ప్రస్తుతం 24? స్థానాలు ఉన్నాయని, ఆ 24 శాతం స్థానాలు యథాతథంగా కొనసాగేలా చూడాలని అన్నారు. ఒకవేళ దక్షిణ భారత ప్రాధాన్యాన్ని 24 శాతం కంటే తగ్గిస్తే ఈ దేశ నిర్మాణంలో విశేష కృషిచేసిన దక్షిణ భారత ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, ఆగ్రహం వ్యక్తమవుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

# పులి వస్తే.. ఎన్ని మేకలను మింగిందో బయటపెడతాం!

- కాళేశ్వరంలో 'పులి' ఏం చేసిందో ప్రజలకు వివరిస్తాం
- 20న అన్ని విషయాలు వెల్లడిస్తాం
- కేసీఆర్ జగిత్యాల సభపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సెటైర్లు
- మహిళా బిల్లు పతనం మోదీ అహంకారానికి చెంపపెట్టని విమర్శ



**హైదరాబాద్, ఏప్రిల్ 18:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాలలో నిర్వహించనున్న సభపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. శనివారం గాంధీభవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ను 'పులి'గా అభివర్ణించే వారిపై విమర్శలు గుప్పించారు. "పులి బయటకు వస్తే.. ఆ పులి ఎన్ని మేకలను మింగిందో, ఎన్ని ఆవులను తిన్నదో మేం బయటపెడతాం. ఆ పులి ఆసరా చూసుకుని ఎన్ని పిల్లులు లాభపడ్డాయో కూడా వివరిస్తాం" అంటూ ఘాటుగా హెచ్చరించారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ, ఈ నెల 20వ తేదీన అన్ని విషయాలను ప్రజల ముందు ఉంచుతామని స్పష్టం చేశారు.

**బీజేపీ ఎంపీలు 'యాక్సిడెంటల్' లీడర్లు**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా మహేశ్ కుమార్ గౌడ్ విరుచుకుపడ్డారు. స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పాత్రే లేదని, ఆ పార్టీ ఎంపీలంతా 'యాక్సిడెంటల్ లీడర్లు' అని ఎద్దేవా చేశారు. మతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టడం తప్ప వారికి ఏమీ తెలియదని మండిపడ్డారు. "కర్ణాటక ఎంపీ (తేజస్వీ సూర్య) తెలంగాణను కించపరుస్తూ మాట్లాడుతుంటే రాష్ట్ర బీజేపీ ఎంపీలు నిద్రపోతున్నారా?" అని నిలదీశారు. నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కనీసం ఒక్క బీసీ నాయకుడినైనా తయారు చేశారా? అని ప్రశ్నించారు. పార్లమెంటులో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ప్రధాని నరేంద్ర మోదీ అహంకారానికి చెంపపెట్టు వంటిదని మహేశ్ గౌడ్ అభివర్ణించారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేసి, ఉత్తర భారతదేశానికి సీట్లు పెంచాలనే కుట్రను ప్రతిపక్షాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయని చెప్పారు. మనువాద భావజాలం ఉన్న బీజేపీకి మహిళా సాధికారతపై చిత్తశుద్ధి లేదని, దేశానికి తొలి మహిళా ప్రధానిని, రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్దేనని గుర్తు చేశారు.

**కిషన్ రెడ్డికి సవాల్**

ఎన్నికల సమయంలో మాత్రమే బీజేపీ నేతలకు దేవుడు గుర్తుకొస్తారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. "జై శ్రీరామ్ అనకుండా తాను చేసిన అభివృద్ధిపై ప్రచారం చేసుకుని కిషన్ రెడ్డి గెలవగలరా?" అని సవాల్ విసిరారు. దేవుడి పేరు చెబితే ఓట్లు రాలే పరిస్థితి ఇప్పుడు లేదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం సీట్లు బీసీలకే కేటాయించామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.



# మహిళా బిల్లుపై నిరసనలకు పిలుపు

**బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు గృహ నిర్బంధం**

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు పిలుపునివ్వడంతో శనివారం ఉదయాన్నే రాంచందర్ రావు ఇంటికి వెళ్లిన పోలీసులు గుహ నిర్బంధం చేశారు. లోక్ సభలో శుక్రవారం మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుందంటూ రేవంత్ ఇంటి ముట్టడికి బీజేపీ సిద్ధమైంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. మ- రోవైపు పోలీసులు తనను నిర్బంధించడంపై ఆయన ఆగ్రహించారు. నారీ శక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్ను వదిలిపెట్టేది లేదని రాంచందర్ రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడారు. కాంగ్రెస్ వైఖరికి నిరసనగా ఈరోజు దేశ వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చామన్నారు. పోలీసులు తనను హౌస్ అరెస్ట్ చేశారని, అయినా తమ పార్టీ శ్రేణులు, నాయకులు రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తారని హెచ్చరించారు. దేశంలో ఇంకా రాచరిక పాలన కావాలని కాంగ్రెస్ భావిస్తోందని మండిపడ్డారు. ఒక్క ముస్లిం సమాజానికి మేలు చేసేందుకు ఈ డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. దేశ ప్రజలు, తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా బుద్ధి చెప్పాలని అన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉద్యోగుల ఉసురు తప్పదు

**ఉద్యోగుల జీతభత్యలు సకాలంలో ఇవ్వడం లేదు**

**పెన్షనర్లకు సకాలంలో అందని బకాయిలు**

**ఐదు డీఏలు పెండింగ్లోనే ఉన్నాయి**

**ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత జి దేవీ ప్రసాద్**



**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందుల పాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత, జి దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్లో ఉన్నాయని, సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు. ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని, రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమీషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక్ చేశారని ఆరోపించారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు భుజంగ రావు తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

# 20నుంచి 26 వరకు వెల్ఫేర్ వీక్

**హైదరాబాద్, ఏప్రిల్18 :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'వెల్ఫేర్ వీక్' నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమం అమలు తీరుపై ఆయన శనివారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఈసందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సబ్యసాచి ఘోష్ రోజువారీ షెడ్యూల్ను వివరించారు జిల్లా కలెక్టర్లు ప్రతి కార్యక్రమం అమలును క్షుణ్ణంగా పర్యవేక్షించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించాలని ఘోష్ సూచించారు. ప్రజాప్రతినిధు లను అన్ని కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయాలని, తద్వారా విస్తృత ప్రచారం, పారదర్శకత పెరుగుతుందని ప్రణాళిక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన పథకాలు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్, ప్రియాంక, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.

# మహిళలను ఏకం చేస్తాం : లక్ష్మణ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించి, మహిళల హక్కులను విపక్షాలు కాలరాశాయని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మహిళలు కదం తొక్కుతున్నారని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాది ప్రజలు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. 'మోదీకి ఆదరణ పెరుగుతుంది, భాజపా బలపడుతుందనే బిల్లును అడ్డుకున్నారు. మహిళలను చట్టసభలకు రాకుండా అడ్డుకున్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని చెప్పినా సాంకేతిక కారణాలతో మహిళా బిల్లును అడ్డుకున్నారు. దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి కాంగ్రెస్, విపక్షాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. డీలిమిటేషన్, 131వ రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రతిపాదనను ఒక్క ఎంపీ కూడా పార్లమెంట్లో ప్రస్తావించలేదని లక్ష్మణ్ అన్నారు.



సంపాదకీయం

# మోదీ సర్కారుకు గుణపాఠం

## విపక్షాల ఐక్యతతో 'సవరణ'కు బ్రేక్!

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావించాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్‌డిఎ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్‌డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్దంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్దంగా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పుడు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉ ండదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శు క్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటంపై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పుడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది. అంతే తప్ప మహిళా బిల్లును వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.

# మహిళలకు విపక్షాలు వ్యతిరేకం



- బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి
- ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి
- కేబినేట్ భేటీలో ప్రధాని మోడీ సూచన
- కేంద్ర ఉద్యోగులకు 2శాతం డీఎ పెంపు
- 13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శు క్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298-230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ) 2 శాతం పెంచడానికి నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది. దాంతో ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అలాగే ఈ క్యాబినెట్ సమావేశంలో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.13వేల కోట్లు కేటాయించనున్నారు. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉ ద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం.

# మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

- డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
- అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్



**చెన్నై, ఏప్రిల్ 18:** మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు అని చెబుతున్నారని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు. బిల్లు వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజనేనని అన్నారు. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించడం, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరచడం బిల్లు ఉద్దేశమని, అందువల్లే ఆ బిల్లును తాము ఓడించామని చెప్పారు. భారతదేశం రాష్ట్రాల యూనియన్ అనీ, అన్ని రాష్ట్రాల ను సమానంగా చూడాలని, కేంద్రంలో ప్రతి రాష్ట్రానికి మాట్లాడే అవకాశం, భాష, సంప్రదాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకునే వీలుండాలని అన్నారు. బీజేపీ పాలనా విధానం ఇందుకు భిన్నంగా ఉందని, ప్రధానమంత్రి ఒకే దేశం, ఒకే నేత, ఒకే భాష, ఒకే ప్రజ అంటూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం గుత్తాధిపత్యాన్ని తమ కూటమి అడ్డుకుంటుందని చెప్పారు. ఢిల్లీ నుంచి తమిళనాడును శాసించాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుకుంటున్నాయని రాహుల్ విమర్శించారు. అయితే ఇందుకు తాము ఎంతమాత్రం అనుమతించేది లేదన్నారు. తమిళనాడు తన భవిష్యత్తును తానే నిర్దేశించుకుంటుందని, తమిళ సంస్కృతి, హక్కులు, భాషా పరిరక్షణలో తాము ప్రజలకు బాసటగా ఉంటామని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# రాహుల్ గాంధీకి ఊరట

### పౌరసత్వ వివాదంలో ఎఫ్ఐఆర్ నమోదుపై హైకోర్టు స్టే



**ప్రయాగ్‌రాజ్, ఏప్రిల్ 17:** పౌరసత్వ వివాదంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ఆదేశాలపై అలహాబాద్ హైకోర్టు శనివారం స్టే విధించింది. శు క్రవారం రాహుల్‌పై విచారణకు ఆదేశించిన అదే లక్నో బెంచ్, నేడు ఆ నిర్ణయాన్ని నిలిపివేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాహుల్ గాంధీ బ్రిటీష్ పౌరసత్వం కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలని జస్టిస్ సుభాష్ విద్యార్థి నేతృత్వంలోని బెంచ్ శుక్రవారం మౌఖికంగా ఆదేశించింది. అయితే, ఈ తీర్పు కాపీపై సంతకం చేసే ముందే కోర్టు తన నిర్ణయాన్ని సమీక్షించుకుంది. నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి (రాహుల్ గాంధీ) వాదన వినకుండా ఏకపక్షంగా ఆదేశాలు ఇవ్వడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. 2014 నాటి ఒక ఫుల్ బెంచ్ తీర్పును ఉటంకిస్తూ, నిందితుడికి నోటీసులు ఇచ్చి వివరణ కోరడం తప్పనిసరని కోర్టు స్పష్టం చేసింది. కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విగ్నేష్ శిశిర్ ఈ పిటిషన్ వేశారు. 2003-2009 మధ్య లండన్‌లోని 'బ్యాక్ ఆప్స్ లిమిటెడ్' అనే కంపెనీకి డైరెక్టర్‌గా ఉన్న సమయంలో రాహుల్ గాంధీ తనను తాను బ్రిటీష్ పౌరుడిగా పేర్కొన్నారని, ఇది భారత రాజ్యాంగం ప్రకారం చట్టవిరుద్ధమని ఆయన వాదన.

# బొమ్మ కార్లతో పేలుళ్లకు ప్లాన్

### నలుగురు అనుమానితుల అరెస్టు

**న్యూఢిల్లీ:** సున్నితమైన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పేలుళ్లు జరిపేందుకు రెక్కీలు నిర్వహిస్తూ, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంల ద్వారా ఇతరులను రిక్రూట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్న నలుగురు వ్యక్తులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. నిఘా ఆధారిత ఆపరేషన్ ద్వారా ఇద్దరు నిందితులు మోసైబ్ అహ్మద్, హహమ్మద్ హమాద్‌ను మహారాష్ట్రలో, షేక్ ఇమ్రాన్ అనే వ్యక్తిని ఒడిశాలో, మహమ్మద్ సోహైల్‌ను బిహార్‌లో అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరిని ఐఈడీ అమర్చిన రిమోట్ కంట్రోల్ బొమ్మ కారు తయారీకి యత్నిస్తుండగా పట్టుకున్నారు. నలుగురు నిందితులు తీవ్రవాద భావజాలంతో ప్రభావితమైనట్టు అధికారులు తెలిపారు. నిందితులలో ఒకడు ఎర్రకోట తమలక్ష్యమని తెలిపే సంకేతంతో నల్లజెండాతో కూడిన ఎర్రకోట మార్ఫింగ్ ఫోటోను షేర్ చేసినట్టు గుర్తించామని చెప్పారు. షేక్ ఇమ్రాన్ అనే నిందితుడు 2025లో ఎర్రకోట, ఇండియా గేట్ సహా కీలక ప్రదేశాల్లో రెక్కీ నిర్వహించినట్టు తెలిపారు. మోసైబ్ గతంలో గల్ఫ్ దేశాల్లో ఆటో ఎలక్ట్రీషియన్‌గా పనిచేశాడని, ఐఈడీ అమర్చిన రిమోట్ కంట్రోల్ కారు డిజైన్‌కు అవసరమైన సాంకేతిక నైపుణ్యం అతనికి ఉందని గుర్తించా మని వివరించారు. ఈ నలుగురిపై కేసు నమోదు చేసి నిందితుల నెట్‌వర్క్ ఛేదించేం దుకు, ఇతర ముఠాలతో సంబంధాలను గుర్తించేందుకు దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.



# హోర్ముజ్ జలసంధిలో హైటెన్షన్

### భారత ట్యాంకర్‌పై ఇరాన్ సైన్యం కాల్పులు!

### మళ్లీ మూతపడిన కీలక జలమార్గం..

**టెహ్రాన్:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ దట్టంగా కమ్ముకున్నాయి. అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభనతో హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. శుక్రవారం జలసంధిని తెరుస్తున్నట్లు ప్రకటించిన ఇరాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దిగ్బంధన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోబోమని స్పష్టం చేయడంతో గంటల వ్యవధిలోనే మళ్లీ జలమార్గంపై ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో శనివారం జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) గన్‌బోట్లు కాల్పులకు పాల్పడటం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఇరాక్ నుంచి సుమారు రెండు మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత్‌కు తీసుకువస్తున్న ఒక భారత జెండా కలిగిన సూపర్ ట్యాంకర్‌తో పాటు మరో వాణిజ్య నౌకపై ఇరాన్ సైన్యం కాల్పులు జరిపినట్లు 'ట్యాంకర్ ట్రాకర్స్' సంస్థ ధృవీకరించింది. ఓమన్ తీరానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎటువంటి ముందస్తు రేడియో హెచ్చరికలు లేకుండానే ఇరాన్ గన్‌బోట్లు కాల్పులు జరపడంతో, సదరు నౌకలు తమ దిశను మార్చుకుని వెనక్కి మళ్లాయి. అదృష్టవశాత్తూ ఈ దాడుల్లో నౌకలకు గానీ, అందలి సిబ్బందికి గానీ ఎటువంటి ప్రాణహాని జరగలేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని సమాచారం అందింది. ఇరాన్ తన ఓడరేవులను తెరుస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, అమెరికా మాత్రం ఇరాన్‌పై తన నావికా దళ దిగ్బంధనాన్ని కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించడం ఈ వివాదానికి ఆజ్యం పోసింది. "అమెరికా తన పద్ధతి మార్చుకోనంత వరకు హోర్ముజ్ జలసంధి తమ సైనిక నియంత్రణలోనే ఉంటుంది" అని ఇరాన్ మిలిటరీ కమాండ్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు సరఫరా చేసే భారత్‌కు చెందిన మరికొన్ని నౌకలు కూడా తమ ప్రయాణాన్ని నిలిపివేసి సురక్షిత ప్రాంతాలకు మళ్లాయి. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు హోర్ముజ్ జలసంధి నుండే వెళ్లాల్సి ఉంటుంది. తాజా కాల్పుల ఘటనతో అంతర్జాతీయ చమురు ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రయత్నాలు జరుగుతున్నా, మరోవైపు ఇరాన్-అమెరికా మధ్య పెరుగుతున్న ఈ ఘర్షణ వాతావరణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపేలా కనిపిస్తోంది. ప్రస్తుతానికి భారత విదేశాంగ శాఖ ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది.

## మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరి బాధాకరం



**నేటి సాక్షి, గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే మహిళా శక్తి వందన్ అభియాన్ బిల్లును కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి వ్యతిరేకించడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ అన్నారు. గన్నేరువరం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు నియోజకవర్గాల పెంపు వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటే, కాంగ్రెస్ పార్టీ మరియు వారి మిత్రపక్షాల ఎంపీలు దీనికి వ్యతిరేకంగా ఓటు వేయడం బాధాకరమని పేర్కొన్నారు. మహిళలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నేతల వైఖరి మహిళా సాధికారతకు అడ్డుతగిలేలా ఉందని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు దక్కేలా అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మచ్చ బాల్రాజ్, పుల్లెల రాము, మచ్చ సాయికృష్ణ, పుల్లెల జగన్ మోహన్, సందెవేళ ప్రశాంత్, టేకు అనిల్, సిరిగిరి తిరుపతి, వినయ్, గాలి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన 33 కేవీ సబ్ స్టేషన్




**నేటి సాక్షి ,దామరగిద్ద నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం విఠలాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి ఆదేశాల మేరకు.. నారాయణపేట కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాంపురం శివారెడ్డి ఈ సబ్ స్టేషన్‌ను ప్రారంభించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సబ్ స్టేషన్ ప్రారంభంతో ప్రాంతీయంగా విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని, ముఖ్యంగా రైతులకు లో-వోల్టేజీ సమస్య తప్పుతుందని పేర్కొన్నారు. నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నుస్తులాపూర్ లో బడిబాట



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్, దాని అనుబంధ గ్రామం గుండ్లచెరుపల్లె ప్రాథమిక పాఠశాలల్లో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో శనివారం "బడి బాట" కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు నాణ్యమైన బోధన అందిస్తున్న అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్య, తిమ్మాపూర్ మండల మాజీ వైస్ ఎంపీపీ తుమ్మనపల్లి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు గోగూరి అంజలి నర్సింహా రెడ్డి, నూనె సురేష్, వంగాల శ్రీనివాస్ రెడ్డి, దాడి మొండి, రొడ్డ హరిత అనిల్, అవుల నర్సయ్య, కొండల్ రావు, స్వరూప కొండయ్య, అలువాల ప్రశాంత్, నాగ్మా నౌషీన్ నిసార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లుపై రాజకీయ వేడి



- ఇండియా కూటమి దిష్టిబొమ్మదహనం
- కథలాపూర్‌లో బీజేపీ ఆందోళన కార్యక్రమం
- మహిళా బిల్లుకు వ్యతిరేకతపై నాయకుల ఆగ్రహం
- 'మహిళా సాధికారతకు చీకటి రోజం'టూ విమర్శలు

**నేటి సాక్షి, కథలాపూర్ (రాధారపు నర్సయ్య):** భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ పిలుపు మేరకు కథలాపూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి, పార్లమెంట్‌లో మహిళా బిల్లును వ్యతిరేకించిన ఇండియా కూటమి నాయకులపై తీవ్రంగా మండిపడ్డారు. మండల అధ్యక్షుడు మల్యాల మారుతి ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం నిర్వహించి నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ పిలుపు మేరకు కథలాపూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు మల్యాల మారుతి ఆధ్వర్యంలో ఇండియా కూటమి దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లును ఇండియా కూటమి నాయకులు వ్యతిరేకించడం దారుణమని వారు అభిప్రాయపడ్డారు. ఇండియా కూటమి నాయకులు మహిళల పట్ల వివక్ష చూపే విధంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. మహిళా సాధికారతకు ఇది చీకటి రోజుగా నిలిచిందని పేర్కొన్నారు. మహిళలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించే బిల్లును అడ్డుకోవడం వెనుక వారి ఉద్దేశాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలిసిపోతున్నాయని ఆరోపించారు. ఈ ఆందోళనలో భాగంగా 'ఇండియా కూటమి డౌన్ డౌన్'..'మహిళా బిల్లును అడ్డుకున్న మూర్ఖుల్లారా ఖబర్దార్'..'కాంగ్రెస్ డౌన్ డౌనం'టూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు గట్టిగా నినాదాలు చేశారు. ఈ నినాదాలతో కథలాపూర్ మండల కేంద్రం రాజకీయ ఉద్రిక్తతతో మార్మోగింది. మహిళా బిల్లుపై దేశవ్యాప్తంగా రాజకీయ చర్చలు ముదురుతున్న తరుణంలో కథలాపూర్‌లో జరిగిన ఈ నిరసన కార్యక్రమం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.మహిళా సాధికారతకు మద్దతుగా తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మల్యాల మారుతి, జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కథలాపూర్ మహేష్, మండల ప్రధాన కార్యదర్శి నరెడ్ల రవి, సీనియర్ నాయకులు బద్రి సత్యం, వొడ్డాటి సునీల్, ఆరే శివకుమార్, పిడుగు ఆనంద్ రెడ్డి, జిల్లా సత్యం, కల్లెడ ప్రసాద్, కంటే రాజాం, తునికి భూమయ్య, పాలేపు నరేష్, యాటకర్ల నరేందర్, కోరుట్ల రాజేష్, అన్నం మహేష్, దండవేణి గంగాధర్, పొన్నోజీ ప్రభూ, పంభాల రాజేందర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సిరిసిల్ల టీఎంఎస్ఆర్ యూ నూతన కార్యవర్గం ఎన్నిక



**సిరిసిల్ల (నేటి సాక్షి - శివకుమార్):** తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (TMSRU) తన కార్యకలాపాలను విస్తరిస్తూ శనివారం సిరిసిల్లలో నూతనంగా శాటిలైట్ శాఖను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి టీఎంఎస్ఆర్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. విద్యాసాగర్ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యకలాపాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు ఈ శాటిలైట్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం సిరిసిల్ల శాటిలైట్ శాఖకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి. మహేష్, కార్యదర్శిగా ఇ. ప్రశాంత్, కోశాధికారిగా కె. ప్రశాంత్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కె. రమేష్, జాయింట్ సెక్రటరీగా కె. సాయికృష్ణతో పాటు కమిటీ సభ్యులుగా రాజు, రమేష్, రాకేష్, శ్రీరామ్, కిశోర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. సిరిసిల్ల ప్రాంతంలోని మెడికల్ రిప్రజెంటేటివ్స్ అందరినీ సమన్వయం చేసుకుంటూ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

# ప్రమాద బాధితుడి కుటుంబానికి బీమా అందజేత



**నేటి సాక్షి,కమలాపూర్ :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి 'ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన' (గ్రామీణ్) పథకం కింద మంజూరైన రెండు లక్షల రూపాయల బీమా చెక్కును శనివారం అందజేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామానికి చెందిన పూజారి కుమారస్వామి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. మృతుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (UBI) కమలాపూర్ శాఖలో బీమా సౌకర్యం పొంది ఉన్నారు. యూనియన్ బ్యాంక్ డీజీఎం కమలాకర్, మేనేజర్ సోమ్లా నాయక్ సహకారంతో, అసిస్టెంట్ మేనేజర్ మహారాజ్ మరియు బ్యాంక్ మిత్ర సెంటర్ సభ్యుడు తౌటం కరుణాకర్ ఆధ్వర్యంలో ఈ బీమా సొమ్మును మృతుడి భార్య పూజారి దేవికి అందజేశారు. ఈ సందర్భంగా డీజీఎం కమలాకర్ మాట్లాడుతూ.. సామాన్యులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తక్కువ ప్రీమియంతో లభించే ఈ బీమా ఆపద సమయంలో కుటుంబానికి ఎంతో అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తే సహించం



- టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్

**నేటి సాక్షి , సిరిసిల్ల(శివకుమార్):** తెలంగాణ గౌరవాన్ని అవమానించేలా పార్లమెంటులో వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట్లాది ప్రజల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ గురించి మాట్లాడే అర్హత తేజస్వి సూర్యకు లేదన్నారు. రాష్ట్రాన్ని సాధించిన అగ్రనేత కేసీఆర్‌ను అవమానించడం అంటే తెలంగాణ ప్రజలను అవమానించడమేనని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. క్షమాపణ చెప్పని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కంచర్ల రవి గౌడ్ తో పాటు ఎస్.కె అప్రోచ్, ఆరెల్లి వినయ్ కుమార్, సిరిమల్లె హరీష్, భాను రాజు, అమీర్, సయ్యద్ శేఖర్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్
ఆదివారం
19 ఏప్రిల్ 2026

# భోగ శ్రావణి పై ఆరోపణలు అర్ధరహితం

- పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా అసత్య ప్రచారాలు ఆపివేయాలి
- భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు



**నేటి సాక్షి, జగిత్యాల(పూరెళ్ల బాపు):** పార్టీ అంతర్గత వ్యవహారాలపై పార్టీ నుండి బహిష్కృతులైన కొంత మంది నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యం మరియు దారితప్పించే విధంగా ఉన్నాయి. రాష్ట్రమంతా అన్ని జిల్లాల్లో మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై సమీక్షలు జరుగుతున్నాయి. దాంట్లో భాగంగానే పార్టీ ఆదేశాల మేరకు మధుసూదన్ రెడ్డి జగిత్యాలలో కూడా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం పార్టీలో లేని, బహిష్కరణకు గురైన కొంతమంది వ్యక్తులు బీజేపీ రాష్ట్ర నాయకురాలు డా.బోగ శ్రావణి గారిపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అర్ధరహితమైనవి. ఇవి కేవలం వ్యక్తిగత అసంతృప్తి, స్వప్రయోజనాల కోసం చేస్తున్న నిరాధార ఆరోపణలు. ఇటీవల జరిగిన ఎన్నికలన్నీ పార్టీ ఆధ్వర్యంలో, ఎంపీ అర్వింద్ నాయకత్వంలో పారదర్శకంగా నిర్వహించబడ్డాయి. ప్రక్రియ అంతా పార్టీ మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా జరిగింది. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా అసత్య ప్రచారం చేయడాన్ని తక్షణమే ఆపివేయాలి. క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై పార్టీ కఠిన చర్యలు తీసుకుంటుంది.

# కాయకల్ప ప్రమాణాలతో ఆస్పత్రిలో సేవలు మెరుగుపరచాలి





- డాక్టర్ శ్రీనివాస ప్రసాద్

**నేటి సాక్షి గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో కాయకల్ప కార్యక్రమం అమలును పరిశీలించేందుకు కాయకల్ప వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రితో పాటు మాతా శిశు సంరక్షణ కేంద్రంలో కూడా విస్తృతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణం, ఓపీ విభాగం, ఇన్‌పేషెంట్ వార్డులు, ప్రసూతి విభాగం, అత్యవసర విభాగం, ల్యాబ్, ఫార్మసీ, శౌచాలయాలు, వంటశాల, తాగునీటి సదుపాయాలు తదితర విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, పారిశుధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణను మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. రోగులు ఆసుపత్రికి వచ్చిన నాటి నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి దశలో సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా వార్డులు, బెడ్లు, బెడ్‌షీట్లు, శౌచాలయాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు.

ఆసుపత్రి ప్రాంగణంలో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, వ్యర్థాలను రంగుల బిన్‌లలో వేరు చేసి నిబంధనల ప్రకారం సురక్షితంగా తరలించాలని సూచించారు. మందుల లభ్యత, వైద్య పరికరాల వినియోగం, శుద్ధి చేసిన తాగునీరు, పారిశుధ్య సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని పేర్కొన్నారు. కాయకల్ప మార్గదర్శకాలు పూర్తిస్థాయిలో అమలు చేస్తే ఆసుపత్రి సేవల్లో మరింత మెరుగుదలతో పాటు ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. రోగులు, వారి బంధువులు ఇబ్బందులు ఎదుర్కొనకుండా సహాయక సిబ్బంది మర్యాదపూర్వకంగా స్పందించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని హితవు పలికారు. ఈ తనిఖీల్లో డాక్టర్ రాజ్ కుమార్ రాజు, గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ శ్రీధర్ (ఆర్ఎంఓ), డాక్టర్ ప్రణితి, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, ఫార్మసీ ఆఫీసర్ విమల ఎఫ్సిబా, సానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్స్ మేహారాజ్ భాను, రజిత, హెడ్ నర్సులు జగదాంబ, ఉమామహేశ్వరి, వకుల దేవి, నిర్మల, పుష్ప, హెల్త్ అసిస్టెంట్లు దేవసాని, వాసుదేవ్, కృష్ణవేణి, ఇమ్యునైజేషన్ విభాగం లత, కనుక లక్ష్మి, భారతమ్మ, ఈసీజీ టెక్నీషియన్ రాజు, ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జి సురేందర్, సంతోష్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు. పారిశుధ్య విభాగ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటిద్దాం



- ప్రమాదాలను నివారిద్దాం
- ట్రాఫిక్ రూల్స్ పాటించడం మన సామాజిక బాధ్యత.....
- జోగులాంబ జోన్-07 డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ ఐపీఎస్
- రోడ్డు భద్రతపై కదం తొక్కిన నారాయణపేట జిల్లా పోలీసులు
- హెల్మెట్ అవగాహనకు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ......
- డిఫెన్స్ డ్రైవింగ్ చేస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు

**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో శనివారం ' కార్యక్రమం కింద రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో హెల్మెట్ ధరించి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజలు, వాహనదారులకు సందేశం అందించారు. ఈ ర్యాలీలో జోగులాంబ జోన్-07 డీఐజీ ఎల్.ఎస్. చౌహన్ , జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తో పాటు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ మార్కెట్ యార్డ్ నుంచి ప్రారంభమై అంబేద్కర్ చౌరస్తా, సత్యనారాయణ చౌరస్తా, యాద్గిర్ రోడ్డు, పాత బస్టాండ్, సెంటర్ చౌక్ మీదుగా శ్రీ గార్డెన్ వరకు కొనసాగింది. అనంతరం శ్రీ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఐజీ ఎల్.ఎస్. చౌహన్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటిస్తేనే ఈ ప్రమాదాలను తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. వాహనదారులు తమ ప్రాణ భద్రత కోసం హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని తెలిపారు. విద్యార్థులు తమ తమ కుటుంబ సభ్యులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... ప్రజలు ఇంటి నుండి వెళ్లి మళ్లీ సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. యువత సమాజంలో మార్పు తీసుకురావడానికి ముందుకు రావాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ... నారాయణపేట జిల్లాలో ప్రతి సంవత్సరం 100కు పైగా రోడ్డు ప్రమాదాల్లో మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఈ సంఖ్యను తగ్గించాలంటే ప్రతి ఒక్కరు డిఫెన్స్ డ్రైవింగ్ అలవాటు చేసుకోవాలని, డ్రైవింగ్ సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం ప్రమాదాల నివారణలో కీలకమని తెలిపారు. కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిరంతర అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ రోజు జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ (వితౌట్ చాలన్)తో కేవలం అవగాహన కార్యక్రమం మాత్రమే నిర్వహిస్తున్నామని, వాహనదారులు స్వచ్ఛందంగా నియమాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, సీఐలు శివశంకర్, సైదులు, భగవంత్ రెడ్డి, ఆర్.ఐ. విజయ్ భాస్కర్, ఆర్టీవో నెంబర్ పోషల్ రాజేష్, కౌన్సిలర్ మహేష్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాజు, రమేష్, సతీష్ రెడ్డి , వెంకటేష్ గౌడ్, నరేష్, బాలరాజు, పోలీసు సిబ్బంది, యువకులు,విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మరికల్ గురుకుల పాఠశాల అక్రమాలపై విచారణ జరపాలి



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా స్థాయి అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు అన్వర్ సదాత్ డిమాండ్ చేశారు. శనివారం మరికల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల పాఠశాలలో కరాటే శిక్షణ పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అక్రమాలను ప్రశ్నిస్తున్న తమ నాయకులపై కేసులు పెడతామని బెదిరించడం సరికాదని, ఇలాంటి బెదిరింపులకు తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోని పక్షంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్వర్ సదాత్ హెచ్చరించారు.

# మహిళా బిల్లును వ్యతిరేకించడం కాంగ్రెస్ సిగ్గుచేటు



**నేటి సాక్షి,గజ్వేల్:** కేంద్ర ప్రభుత్వం చారిత్రకంగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కూటమి వ్యతిరేకించడం సిగ్గుచేటని బీజేపీ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ శనివారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు కాంగ్రెస్ కూటమి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్, పట్టణ శాఖ అధ్యక్షుడు మనోహర్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి మహిళల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే మహిళా బిల్లును అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు మహిళా బిల్లును ఎందుకు అమలు చేయలేదని వారు ప్రశ్నించారు. దేశంలో మహిళలకు రాజ్యాంగబద్ధంగా సమాన అవకాశాలు కల్పించేలా బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రకమని, దీనిని అడ్డుకోవడం రాజకీయ కుతంత్రమేనని మండిపడ్డారు. మహిళా బిల్లుతో దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుందని, దీనిని అడ్డుకునే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# రిక్వెస్ట్ బస్ స్టాప్ బోర్డు ఏర్పాటు




నేటి సాక్షి, ధర్మారం: ధర్మారం మండలం మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల & కళాశాల వద్ద గత కొన్ని నెలలుగా ఆర్టీసీ బస్సులు ఆపకపోవడం వల్ల టీచర్లు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు అనారోగ్యం పాలైతే హాస్పిటల్ వెహికల్స్ ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్- తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సుంచు మల్లేశం ఇటీవల కరీంనగర్ ఆర్టీసీ డిపో వన్ మేనేజర్ ను కలిసి దరఖాస్తు ఇవ్వగా అక్కడ రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని డిపో మేనేజర్ సూచించారు. డిపో మేనేజర్ సూచనల మేరకు మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్- తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు సుంచు మల్లేశం తన సొంత ఖర్చులతో ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్ బోర్డును శనివారం పాఠశాల గేటు బయట ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గురుకుల పాఠశాల వద్ద ఆర్టీసీ బస్సులు ఆపకపోవడం దారుణమని. ఉపాధ్యాయులు పత్తిపాక ఎక్స్ రోడ్ వద్ద దిగి అక్కడే ఎక్కాల్సిన పరిస్థితి వస్తుందని నైట్ స్టే అనంతరం ఉపాధ్యాయులు పాఠశాల నుండి నడిచి వెళ్లడం వల్ల వారికి భద్రతా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు, సంబంధిత మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని మల్లాపూర్ గురుకుల పాఠశాల వద్ద ఆర్టిసి బస్సులను నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ, వైస్ ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి, మాజీ పేరెంట్స్ కమిటీ నాయకులు వడ్కాపురం రవి, కాంపల్లి తిరుపతి, మెట్పల్లి నరేష్, జుంజి పెల్లి నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్‌ను ఆకస్మిక తనిఖీ

జిల్లా కో-ఆర్డినేటర్ కుమారస్వామి



**నేటి సాక్షి, ధర్మారం:** పెద్దపల్లి జిల్లా ధర్మారం 108 అంబులెన్స్ ను జిల్లా కో-ఆర్డినేటర్ జంపాల కుమారస్వామి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఎక్విప్మెంట్ కు సంబంధించిన పరికరాల పనితీరును పరిశీలించారు. స్టెతస్కోప్, బి.పి ఆపరేటర్, పల్సాక్షి మీటర్, మల్టీ ఛానల్ మానిటర్, ఆక్సిజన్ వర్కింగ్ కండిషన్ ను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సమయంలో కాల్ వచ్చినప్పుడు తక్షణమే స్పందించాలని అంబులెన్స్ సిబ్బందికి సూచించారు. 108 వాహనంలో తరలించే పేషంట్లను తరలించేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నిరంతరం అందుబాటులో ఉంటూ అందరికి సేవలందించాలని అంబులెన్స్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మారం అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఏ. సతీష్, పైలెట్ ఎం. రమేష్ ఉన్నారు.

# సన్‌రైజర్స్ సత్తా!





**హైదరాబాద్, ఏప్రిల్ 18:** సొంత గడ్డపై సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ ఆర్ హెచ్) సత్తా చాటింది. ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో చెన్నై సూపర్ కింగ్స్ (సీ ఎస్ కే) పై 10 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఎస్ ఆర్ హెచ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో సీ ఎస్ కే పోరాడినా.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 184 పరుగులకే పరిమితమైంది. బ్యాటింగ్ లో అభిషేక్ శర్మ, బౌలింగ్ లో ఈషాన్ మలింగ అద్భుత ప్రదర్శనతో సన్ రైజర్స్ కు విజయాన్ని

## ఆకాశమే హద్దుగా అభిషేక్, క్లాసెన్

మొదట బ్యాటింగ్ కు దిగిన సన్ రైజర్స్ కు ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 22 బంతుల్లోనే 59 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ట్రావిస్ హెడ్ 20 బంతుల్లో 23 పరుగులు చేసి రాణించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హెన్రిచ్ క్లాసెన్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 39 బంతుల్లో 59 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బాటలు వేశాడు. చివర్లో వికెట్లు పడినా.. సన్ రైజర్స్ 194 పరుగుల భారీ స్కోరు సాధించింది. సీ ఎస్ కే బౌలర్లలో అన్షుల్ కంబోజ్ 3 ఓవర్లలో 22 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. జేమీ ఓవర్టన్ 4 ఓవర్లలో 37 పరుగులిచ్చి 3 వికెట్లు దక్కించుకున్నాడు. ముకేశ్ చౌదరి 2 వికెట్లు తీశాడు.

## తడబడిన చెన్నై ఛేదన

195 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్ కు ఆశించిన ఆరంభం లభించలేదు. సన్ రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో చెన్నై బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు ఇబ్బంది పడ్డారు. ఓపెనర్ మ్యాట్ షార్ట్ 30 బంతుల్లో 34 పరుగులు చేసి కాస్త పోరాడాడు. మిడిలార్డర్ లో కుర్రాడు ఆయుష్ మ్హాత్రే 13 బంతుల్లోనే 30 పరుగులు చేసి ఆశలు రేపాడు. సర్ఫరాజ్ ఖాన్ 19 బంతుల్లో 25 పరుగులు చేశాడు. వీరు మినహా మిగతా బ్యాటర్లు ఎవరూ భారీ స్కోర్లు చేయలేకపోవడంతో చెన్నైకి ఓటమి తప్పలేదు.

## కట్టడి చేసిన బౌలర్లు

సన్ రైజర్స్ బౌలర్లు సమిష్టిగా రాణించి జట్టుకు విజయాన్ని ఖాయం చేశారు. ఈషాన్ మలింగ తన 4 ఓవర్ల కోటాలో 29 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. యువ పేసర్ నితీశ్ కుమార్ రెడ్డి 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. శివాంగ్ కుమార్ తన 3 ఓవర్ల స్పెల్ లో కేవలం 18 పరుగులు ఇచ్చి ఒక వికెట్ దక్కించుకుని చెన్నై బ్యాటర్లను కట్టడి చేశాడు. బౌలర్ల సమష్టి కృషితో సన్ రైజర్స్ సొంత మైదానంలో అభిమానులకు ఉత్కంఠ



# ఢిల్లీ ధమాకా!

- ఆఖరి బంతి ముంగిట డీసీ విజయం
- నిలిచిన స్టబ్స్, రాహుల్ క్రీజు పోరాటం
- సత్తా చాటిన ఢిల్లీ స్పిన్నర్లు
- సాల్ట్ మెరుపులు, కోహ్లీ శ్రమ వృథా
- ఆకట్టుకున్న ట్రిస్టన్ స్టబ్స్ ఆటతీరు

**బెంగళూరుకు తప్పని పరాజయం**






**బెంగళూరు, ఏప్రిల్ 18:** ఐపీఎల్ లో మరో ఉత్కంఠ భరిత మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పై ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ఆరు వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఆఖరి ఓవర్ వరకు నరాలు తెగే ఉత్కంఠ నడుమ సాగిన ఈ పోరులో ఢిల్లీ కేవలం ఒక బంతి మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేయగా.. లక్ష్య ఛేదనలో డీసీ 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. ఒత్తిడిని జయించి అజేయ అర్ధ సెంచరీతో జట్టును గెలిపించిన ట్రిస్టన్ స్టబ్స్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

## సాల్ట్ మెరిసినా.. తడబడిన మిడిలార్డర్

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ కు దిగిన ఆర్సీబీ కి ఓపెనర్ ఫిల్ సాల్ట్ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 38 బంతుల్లోనే 63 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. విరాట్ కోహ్లీ (13 బంతుల్లో 19) కాసేపు మెరుపులు మెరిపించాడు. ఒక దశలో ఆర్సీబీ భారీ స్కోరు చేసేలా కనిపించింది. అయితే డీసీ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మిడిలార్డర్ తడబడింది. చివర్లో టిమ్ డేవిడ్ (17 బంతుల్లో 26) రాణించడంతో ఆర్సీబీ 175 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. డీసీ బౌలర్లలో అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, లుంగి ఎంగిడి తలా రెండు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశారు.

## రాహుల్ మెరుపులు.. స్టబ్స్ ఫినిషింగ్

176 పరుగుల లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ కు ఓపెనర్ కేఎల్ రాహుల్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. ఆర్సీబీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ 34 బంతుల్లోనే 57 పరుగులు చేసి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ట్రిస్టన్ స్టబ్స్ బాధ్యతాయుతంగా ఆడాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం తొందరపడకుండా అక్షర్ పటేల్ (19 బంతుల్లో 26) తో కలిసి విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. భువనేశ్వర్ కుమార్ (4 ఓవర్లలో 3/26) అద్భుతమైన బౌలింగ్ తో ఢిల్లీని దెబ్బకొట్టే ప్రయత్నం చేశాడు. కానీ స్టబ్స్ (47 బంతుల్లో 60 నాటౌట్) క్రీజులో పాతుకుపోయి మ్యాచ్ ను విజయవంతంగా ముగించాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో విజయానికి పరుగులు అవసరమైన దశలో రోమారియో షెఫర్డ్ బౌలింగ్ లో లాంఛనాన్ని పూర్తి చేశాడు.



## రస్ట్ రెడ్ లుక్‌లో అదరగొట్టిన

# 'ఫౌజీ' లేడీ



కన్నడ సినీ ప్రపంచంలో 'సప్త సాగరాలు దాటి సైడ్ బి' చిత్రంతో తన నటనకు మంచి గుర్తింపు తెచ్చుకున్న చైత్ర జే ఆచార్ ఇప్పుడు తన కెరీర్‌లో కీలక మలుపు దిశగా అడుగులు వేస్తోందని టాక్ వినిపిస్తోంది. టాలెంటెడ్ యాక్ట్రెస్‌గా పేరొందిన ఆమె, త్వరలోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుందనే వార్తలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సూపర్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఫౌజీ'లో చైత్రకు అవకాశం దక్కినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆమె కీలక పాత్రలో కనిపించనుందని సమాచారం. ఇదే నిజమైతే, చైత్రకు ఇది తెలుగు తెరపై ఎంతో ఆసక్తికరమైన డెబ్యూ అవుతుంది. 1940ల కాలనీయ భారతదేశం నేపథ్యంగా రూపొందుతున్న 'ఫౌజీ' ఒక పీరియడ్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో ఇమాన్వి కూడా ముఖ్య పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక చైత్ర ఇటీవల రస్ట్ రెడ్ అవుట్‌ఫిట్‌లో కనిపించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సింపుల్ స్టైల్‌తోనే ఎలిగెంట్ లుక్‌ను ప్రెజెంట్ చేస్తూ ఆమె అందం అభిమానులను ఆకట్టుకుంటోంది. నటనతో పాటు స్టైల్‌లోనూ మెప్పిస్తున్న చైత్ర, 'ఫౌజీ'తో టాలీవుడ్‌లో ఎలాంటి ముద్ర వేస్తుందో చూడాలి. ఈ సినిమా 2026 చివరలో లేదా 2027లో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.



## అందంలో సూపర్ హిట్...

# సక్సెస్ యావరేజ్


మోడలింగ్ నుంచి వెండితెరకు వచ్చిన దివ్యభారతి తన అందం, స్టైల్‌తో తొలినాళ్లలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. కానీ తొలి సినిమా తర్వాత రావాల్సిన అవకాశాలు ఆలస్యమవడంతో ఆమె కెరీర్ ఊహించినంత వేగంగా ముందుకు సాగలేదు. దీంతో ఆమె దగ్గర ఉన్న ప్రతిభ పూర్తిగా బయటపడే అవకాశాలు ఇంకా దక్కలేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. సినిమాల్లో విరామం కనిపించినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఆమె ప్రభావం ఏమాత్రం తగ్గలేదు. ఇటీవల రాయల్ బ్లూ గౌన్‌లో చేసిన ఫోటోషూట్‌లో ఆమె అందం మరింత హైలైట్ అయింది. సాదాసీదా లుక్‌లోనూ ఆకట్టుకునే గ్లామర్‌తో అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. కెమెరా ముందు ఆమె చూపించే ఆత్మవిశ్వాసం, ప్రెజెన్స్ మాత్రం ఎప్పటికీ తగ్గదని మరోసారి స్పష్టమైంది. అయితే నిజమైన గుర్తింపు మాత్రం ఒక పెద్ద విజయంతోనే వస్తుంది. సరైన కథ, బలమైన పాత్ర దొరికితే దివ్యభారతి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటడం కష్టమేమీ కాదని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటివరకు అందంతో ఆకట్టుకున్న ఆమె, కెరీర్‌లో కూడా అదే స్థాయి విజయాన్ని ఎప్పుడు అందుకుంటుందో చూడాల్సి ఉంది.



## సల్మాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ



బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మరియు టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ శనివారం పట్టాలెక్కింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం రెగ్యులర్ షూటింగ్ నేటి నుంచి ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో 'లేడీ సూపర్ స్టార్' నయనతార కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకాయి. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి డైరెక్షన్‌లో నటించడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పాన్-ఇండియా చిత్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ నెలనుంచే షూటింగ్ మొదలవుతుందని గతంలోనే ప్రకటించిన చిత్ర బృందం, ఈరోజు నుంచి కెమెరా ముందుకు వెళు _న్నట్లు వెల్లడించింది. యాక్షన్ మరియు ఎమోషన్స్ కలయికగా రానున్న ఈ చిత్రం 2027 ప్రథమార్థంలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.





## వారణాసి కోసం పాట చిత్రీకరణ

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'వారణాసి'. ఈ సినిమా గత కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో చిత్రీకరణ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇక్కడే ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో పాట చిత్రీకరణ చేస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిన్ నృత్యరీతులు అందిస్తున్నట్లు తెలిసింది. ఈ పాట చిత్రీకరణ పూర్తయ్యాక చిత్ర బృందం మే నెలంతా విరామం తీసుకోనుందని.. జూన్‌లో షూట్ తిరిగి ప్రారంభించనున్నారని తెలుస్తోంది. వివిధ యుగాలతో ముడిపడి సాగే ఆసక్తికర కథతో ఈ సినిమా ముస్తాబవుతుండగా.. మహేశ్ దీంట్లో శ్రీరాముడిగా, రుద్రగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: ఎంఎం కీరవాణి, కథ: కె విజయేంద్ర ప్రసాద్, ఎస్ఎస్ కంచి, మాటలు: దేవ కట్టా, ఛాయాగ్రహణం: పీఎస్ వినోద్.

## బన్నీలో ఆ గ్రేస్ చాలా ఇష్టం

తెలుగు ప్రేక్షకులకు 'ఉయ్యాలా జంపాల' సినిమాతో దగ్గరైన అవికా గోర్, తన నటనతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం విభిన్నమైన కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ నటి, తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై తన అభిమానం వ్యక్తం చేసింది. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, బన్నీ డాన్స్ స్టైల్ తనను ఎంతగానో ఆకట్టుకుంటుందని చెప్పింది. ముఖ్యంగా ఆయనలో కనిపించే గ్రేస్ చాలా ప్రత్యేకమని, అదే తనకు అత్యంత ఇష్టమని పేర్కొంది. "డాన్స్‌లో ఆయన చూపించే ఆ ఫ్లో, ఈజ్ చాలా అద్భుతంగా ఉంటుంది. అలాంటి గ్రేస్ ప్రతి ఒక్కరికి సాధ్యం కాదు" అని ఆమె తెలిపింది. అల్లు అర్జున్ కేవలం డాన్స్‌లోనే కాకుండా, తనను తాను తీర్చిదిద్దుకునే విధానంలోనూ ఎంతో ప్రేరణనిస్తారని అవికా చెప్పింది. ఆయనలో ఉండే ఎనర్జీ, పాజిటివ్ వైబ్ తనను బాగా ఆకట్టుకుంటాయని పేర్కొంది. సెల్ఫ్ మేడ్ స్టార్‌గా ఎదిగిన బన్నీ ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఆమె అభిప్రాయపడింది. ప్రస్తుతం అవికా చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల్లో చర్చకు దారితీస్తున్నాయి.

## గోల్డ్ లుక్‌లో గ్లామర్ షో..

# ప్రగ్యా హాట్ హంగామా!

ప్రగ్యా జైస్వాల్ మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేసింది. సినిమాల్లో అందంతో ఆకట్టుకునే ఈ బ్యూటీ, ఆఫ్‌స్క్రీన్‌లోనూ అదే స్టైల్‌ను కొనసాగిస్తూ అభిమానులను మెప్పిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోషూట్‌లో ప్రగ్యా గోల్డ్ కలర్ స్లీవ్‌లెస్ టైట్ డ్రెస్‌లో మెరిసిపోతూ హాట్ హంగామా సృష్టించింది. సింపుల్ యాక్సెసరీస్‌తోనే స్టైలిష్ లుక్‌ను ప్రెజెంట్ చేస్తూ, చిన్న ఈయర్‌రింగ్స్, గోల్డ్ హైహీల్స్‌తో తన అవుట్‌ఫిట్‌ను మరింత హైలైట్ చేసింది. హెయిర్ స్టైలింగ్ కూడా ఆమె లుక్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది. వివిధ యాంగిల్స్‌లో ఇచ్చిన పోజులు, కాన్ఫిడెంట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ప్రగ్యా మరోసారి తన గ్లామర్ పవర్‌ను చూపించింది. ఈ ఫోటోలలో ఆమె అందం, స్టైల్ కలిసి అభిమానులను కట్టిపడేస్తున్నాయి. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ, నెటిజన్ల నుంచి భారీ స్పందనను అందుకుంటున్నాయి. గోల్డ్ లుక్‌లో ప్రగ్యా చూపించిన ఈ గ్లామర్ షో, ఆమె ఫ్యాన్స్‌కు మరో విజువల్ ట్రీట్‌గా మారింది.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# వికారాబాద్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**క్వింటాలుకు రూ. 2,400 మద్దతు ధర.**



**నేటి సాక్షి వికారాబాద్ :** తెలంగాణ శాసనసభ సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశానుసారం వికారాబాద్ డిసిఎంఎస్ కార్యాలయ ప్రాంగణంలో మార్క్ఫెడ్, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మక్కలకు క్వింటాలుకు 2,400 రూపాయల మద్దతు ధర నిర్ణయించిందని, రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశం, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథం సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బి. రాజశేఖర్ రెడ్డి, చిగుళ్లపల్లి రమేష్, డీసీఎంఎస్ మేనేజర్ సుదర్శన్ రెడ్డితో పాటు పలువురు ఏఎంసీ డైరెక్టర్లు, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

# కొండ్రన్ పల్లికి మిషన్ భగీరథ

**గ్రామ సర్పంచ్ సుధాకర్**



**నేటి సాక్షి,నారాయణపేట (ఇమామ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని కొండ్రంపల్లి గ్రామానికి మిషన్ భగీరథ మంచి నీళ్ల శనివారం ప్రారంభమైందని కొండ్రంపల్లి గ్రామ సర్పంచ్ సుధాకర్ తెలిపారు. గత కొంతకాలంగా మిషన్ భగీరథ నీళ్ళు గ్రామానికి వచ్చేవి కావని, ఇట్టి విషయంపై సర్వసభ్య సమావేశంలో జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకు పోవడంతో గ్రామానికి రెండు రోజులకు లోపు మిషన్ భగీరథ నీళ్లు రావడం జరిగిందని సర్పంచ్ సుధాకర్ తెలిపారు. జిల్లా అధికారులకు గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు గ్రామ సర్పంచ్ సుధాకర్ తెలిపారు.

# చౌడేపల్లిలో మృత్యుంజయేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**నేటి సాక్షి,చౌడేపల్లి :** చౌడేపల్లి మండల కేంద్రంలో వెలసిన శ్రీ మృత్యుంజయేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 21 నుండి మే 3వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ జిల్లా సహాయక కమిషనర్ చిట్టెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 21న హోలియా తరపున గణపతి ప్రార్థన మరియు అంకురార్పణతో వేడుకలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 22న పద్మశాలి కులస్థులచే ధ్వజారోహణం, రాత్రి విశ్వబ్రాహ్మణులచే సింహ వాహన సేవ నిర్వహిస్తారు. 23న అశోక్ మరియు సుదర్శన్ ఆధ్వర్యంలో యాళి వాహన సేవ, 24న ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో శేష వాహన సేవ, 25న సజ్జన కులస్థులచే రావణ వాహన సేవలు ఉంటాయి. ఏప్రిల్ 26న రామనాథం కుటుంబ సభ్యులచే పగలు ఇత్తడి నంది వాహనం, రాత్రి తుంగ వెంకటేష్ కుటుంబ సభ్యులచే నంది వాహన సేవలు నిర్వహించబడతాయి. 27న జంగం సిద్దయ్య వారసుడు శివ శంకర్ ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణోత్సవం కన్నుల పండుగగా జరగనుండగా, రాత్రి మజరా రెడ్ల ఆధ్వర్యంలో ఏనుగు వాహన సేవ ఉంటుంది. 28న బలిజ సంఘం ఆధ్వర్యంలో రథోత్సవం, 29న అన్నం వంశీయులచే గుర్రపు వాహన సేవ, 30న బ్రాహ్మణ సంఘంచే హంస వాహన సేవ మరియు ధ్వజారోహణము నిర్వహిస్తారు. మే 1న ఆమెనుగుంట రాజేంద్ర రాయల్ కుటుంబ సభ్యులచే ప్రథమ శయనోత్సవం, 2న కె.వి.గిరి ఆధ్వర్యంలో ద్వితీయ శయనోత్సవం జరగనున్నాయి. చివరగా మే 3న ఆలయ నౌకర్లచే ఉయ్యాలోత్సవం మరియు ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ పవిత్ర ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని అధికారులు కోరారు.



# కాంగ్రెస్ పాలనలో అన్నదాతల ఆగమాగం

**ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



**నేటి సాక్షి,వికారాబాద్,ధారూర్ :** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధిలోని నాగుసన్‌పల్లి, తరిగోపుల, అల్లీపూర్ గ్రామాల్లో పర్యటించిన ఆమె, అక్కడ ఆరబోసిన మొక్కజొన్న, జొన్న కల్లాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో వ్యవసాయంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిన తెలంగాణ, నేడు కాంగ్రెస్ చేతకానితనం వల్ల కుదేలైందని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించకపోవడంతో రైతులు దళారుల చేతుల్లో చిక్కి క్వింటాల్‌కు వేల రూపాయలు నష్టపోతున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్‌లో బోనస్ ఇస్తామని చెప్పి, నేడు ఆ మాటను బోగస్ చేశారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి, మంత్రులు గాలి మోటార్లలో తిరుగుతూ ఢిల్లీ పర్యటనలకు ప్రాధాన్యత ఇస్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో రైతుల కన్నీళ్లు తుడిచేందుకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. ధారూర్ మండలంలో వేల ఎకరాల్లో పంటలు కోతకు వచ్చినా కొనుగోలు కేంద్రాల ఊసే లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలని డిమాండ్ చేశారు. పండిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మక్తల్‌లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్



**నేటి సాక్షి మక్తల్,నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలోని ఆరో వార్డు ఉప ఎన్నికల పోలింగ్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల నిర్వహణ తీరును, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్, జిల్లా అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. మక్తల్ పరిధిలోని చందాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించిన వారు, ఓటింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ.. గతంలో అభ్యర్థి మరణంతో వాయిదా పడిన ఆరో వార్డు ఎన్నికలను పారదర్శకంగా, పటిష్ట భద్రత నడుమ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరియు దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, పోలింగ్ పూర్తయ్యే వరకు పోలీసులు హై అలర్ట్‌లో ఉండాలని స్పష్టం చేశారు. ఓటర్లు ఉత్సాహంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేషనల్ శిక్షా అవార్డుల్లో ఆక్స్‌ఫర్డ్ ప్రథమ స్థానం




**నేటి సాక్షి,జగిత్యాల(పూరెల్ల బాపు):** హైదరాబాద్‌లోని నోవోటెల్ హోటల్‌లో ఘనంగా నిర్వహించిన 'నేషనల్ లెవల్ శిక్ష అవార్డ్స్' కార్యక్రమంలో జగిత్యాలకు చెందిన ఆక్స్‌ఫర్డ్ మరియు అభ్యాస పాఠశాలలు జాతీయ స్థాయిలో సత్తా చాటాయి. ప్రొపెల్ కరికులం ఇంప్లిమెంటేషన్ విభాగంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ దేశవ్యాప్తంగా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, పిన్నాకిల్ కరికులం ఇంప్లిమెంటేషన్ విభాగంలో అభ్యాస స్కూల్ ద్వితీయ స్థానాన్ని సాధించింది. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో రెండు విభిన్న విద్యా విధానాలలో (కరికులమ్స్) అవార్డులు సాధించడం విశేషం. సంస్థ సీఈవో సుమిత్ బాయల్ చేతుల మీదుగా పాఠశాల చైర్మన్ భోగ రవి ప్రసాద్, కరస్పాండెంట్ శ్రీదేవి ఈ అవార్డులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యను అందించడంలో తాము పాటిస్తున్న నిబద్ధతకు ఈ అవార్డులు గుర్తింపు అని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో తమ పాఠశాలలు నిలవడం పట్ల జగిత్యాల విద్యావేత్తలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# న్యాయ ప్రతిభకు జాతీయ గౌరవం

- **జడ్జి దేవరపల్లి నాగేశ్వరరావుకు ఘన సన్మానం**



**నేటి సాక్షి,మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** న్యాయరంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి నాగేశ్వరరావును హైకోర్టు న్యాయమూర్తి, జగిత్యాల జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి రేణుక యేరా ఘనంగా సన్మానించారు. న్యాయ పరిశోధనల ద్వారా ఆయన సాధించిన అరుదైన ఘనతను కొనియాడుతూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి రేణుక యేరా మాట్లాడుతూ.. నాగేశ్వరరావు చేసిన లోతైన అధ్యయనాలు సుప్రీంకోర్టు మరియు అలహాబాద్ హైకోర్టు తీర్పుల్లో ప్రస్తావించబడటం గర్వకారణమన్నారు. ముఖ్యంగా పోలీసు దర్యాప్తు విధానాలపై ఆయన చేసిన పరిశోధనలు న్యాయ వ్యవస్థకు దిక్సూచిగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. జగిత్యాల ప్రిన్సిపల్ జిల్లా & సెషన్స్ జడ్జి శ్రీమతి సి. రత్న పద్మావతి మాట్లాడుతూ, నాగేశ్వరరావు సాధించిన విజయం జిల్లా న్యాయ వ్యవస్థకే గౌరవమని, ఇది యువ న్యాయాధికారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సాధారణంగా ట్రయల్ కోర్టు స్థాయి న్యాయమూర్తుల పరిశోధనలు అత్యున్నత న్యాయస్థానాల్లో ప్రామాణికంగా తీసుకోవడం అరుదని, అలాంటి గుర్తింపును నాగేశ్వరరావు సాధించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని న్యాయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనను అభినందించారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యం

## కొత్త వంగడాల ఆవిష్కరణలో ప్రభాకర్ రెడ్డి






**నేటి సాక్షిహైదరాబాద్ :** రైతుల ప్రయోజనాలే పరమావధిగా తమ సంస్థ ఎప్పటికప్పుడు మేలైన, కొత్త రకం వంగడాలను అభివృద్ధి చేస్తోందని గోల్డెన్ సీడ్ ఇంటర్నేషనల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (వీణ) ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది మార్కెట్లోకి వస్తున్న 'సర్పంచ్', 'ఆమనీ గోల్డ్' వరి రకాలు మరియు 'గోల్డెన్ 99' మొక్కజొన్న విత్తనాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తెగుళ్లను తట్టుకుంటూ అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలను అందించడమే తమ లక్ష్యమన్నారు. కేవలం ఆర్థిక లాభాల కోసం కాకుండా, రైతులు మరియు డీలర్ల క్షేమం కోసం తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. విత్తన ఉత్పత్తిలో (గ్రాతీశీసబఙుశీఅ) తనకు ఉన్న సుదీర్ఘ అనుభవంతో ఈ కొత్త రకాలను రూపొందించినట్లు వివరించారు.

**కొత్త రకాల ప్రత్యేకతలు:**

సర్పంచ్ (వరి – దొడ్డు రకం): ఎకరాకు సుమారు 35 నుండి 40 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుంది.

ఆమనీ గోల్డ్ (వరి – సన్న రకం): ఎకరాకు 30 నుండి 35 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుంది.

రాయల్ 99 (మొక్కజొన్న): తక్కువ నీటి వసతి ఉన్నప్పటికీ ఎకరాకు సుమారు 30 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించవచ్చు.

ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన డీలర్లు భాస్కర్ రెడ్డి, అంబారెడ్డి, బాలు, సంజీవ్, మహేందర్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


# సమస్యల పరిష్కారానికి మీ చెంతకే వస్తా





● **మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**నేటి సాక్షి,ధర్మారం:** ప్రజల సమస్యలను పరిష్కరించడానికి తాను స్వయంగా గ్రామాలకే వస్తానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ధర్మారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో సుమారు రూ.2 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధర్మారం మండల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధుల హామీ ఇచ్చారని తెలిపారు. యువత కోసం మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎర్రగుంటపల్లిలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గ ప్రజలు పనుల కోసం హైదరాబాద్ రావాల్సిన అవసరం లేకుండా వారంలో మూడు రోజులు ఇక్కడే అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి సహకరించాలని కోరారు. అనంతరం 61 మంది రైతులకు రూ.18.24 లక్షల విలువైన వ్యవసాయ పరికరాలు, 24 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్ల నాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణు, డి.సి.ఓ. శ్రీమాల, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ లతో పాటు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మాతా శిశు సంరక్షణకు ప్రాధాన్యతనివ్వాలి




● **జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**నేటి సాక్షి,వికారాబాద్ :** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మాతా శిశు సంరక్షణతో పాటు గర్భవతులకు అన్ని రకాల వైద్య సేవలు సక్రమంగా అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాతృ మరణాలు సంభవించకుండా పటిష్ట జాగ్రత్తలు తీసుకోవాలని, గర్భవతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్‌ను 100 శాతానికి పెంచాలని, టీబీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్స అందిస్తూ వివరాలను 'నిశ్చయ్' పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. 14–15 ఏళ్ల బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జాతీయ నాణ్యతా ప్రమాణాలను (NQAS) పాటించాలని, ఇందుకోసం అవసరమైన మౌలిక వసతులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. స్వర్ణ కుమారి, జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి, కొడంగల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ మాలతి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పవిత్ర, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ పద్మ, డిప్యూటీ డిఎంహెచ్‌ఓలు డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ జ్యోతి మరియు పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

## జనగణన శిక్షణ సమయాలు మార్చాలి

**కలెక్టర్‌కు ఉపాధ్యాయ సంఘాల విన్నతి**

**నేటి సాక్షి,కరీంనగర్ :** సెన్సెస్ 2027 కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల సమయాలను వేసవి ఎండల దృష్ట్యా మార్చాలని కోరుతూ వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం జిల్లాలో నాలుగు విడుతలుగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుండటంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఈ శిక్షణా తరగతులకు హాజరయ్యే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎండ తీవ్రత వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, కావున శిక్షణ సమయాన్ని ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మార్చాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ చిత్రా మిశ్రా.. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ (గ్రాఞఖ ఖా) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అయిలేని కరుణాకర్ రెడ్డి, మర్రి జైపాల్ రెడ్డి, ఎస్టీయూ (ఞఖ ఖా) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిన్నింటి తిరుపతిరావు, కోట శ్యామ్ కుమార్, డీటీఎఫ్ (ఖఖీ) జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, నాయకులు అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో జనసేన సభ్యత్వ వెల్లువ

**వెయ్యి మార్కును దాటిన నమోదు**



**నేటి సాక్షి,ధర్మపురి :** జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భావజాలం పట్ల తెలంగాణ ప్రజల్లో ముఖ్యంగా యువతలో ఆసక్తి పెరుగుతోందని ధర్మపురి నియోజకవర్గ జనసేన నాయకులు ఓడేటి కరుణాకర్ అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో చేపట్టిన జనసేన పార్టీ 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించిందని ఆయన వెల్లడించారు. గత ఏడాది నియోజకవర్గంలో కేవలం 200 సభ్యత్వాలు మాత్రమే నమోదు కాగా, ఈ ఏడాది ఆ సంఖ్య వెయ్యి దాటడం పార్టీ పట్ల పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని కరుణాకర్ పేర్కొన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, వారందరికీ భీమా సౌకర్యం వర్తిస్తుందని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ సభ్యత్వ నమోదును విజయవంతం చేసిన సంగనాభట్ల వినయ్, ముత్యాల వినోద్, అయ్యోరి సాయి కిరణ్, ఆకుల నరేష్, బిసగోని రవి, రాయిల్ల నాగరాజు, లింగం బాలు, సంద పవన్ కళ్యాణ్, గంగాధర్, గోనె వెంకటేష్, గాజర్ల తిరుపతి, బుర్ర శ్రీనివాస్ మరియు వీర మహిళలు మనీత రెడ్డి, శ్రీలత తదితర 'సాధక్'లను ఆయన పేరుపేరునా అభినందించారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా,**



**నేటి సాక్షి ,వికారాబాద్ :** వికారాబాద్ జిల్లావ్యాప్తంగా సాగుతున్న "అరైవ్ అలైవ్" (Arrive Alive) రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు నేడు ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఈ ఆరవ రోజును 'జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే'గా ప్రకటించి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించకుండా కౌన్సెలింగ్ ద్వారా వినూత్నంగా అవగాహన కల్పించారు. వికారాబాద్ పట్టణంలో ఎస్హెచ్ఓ (SHO) ఆధ్వర్యంలో 'హెల్మెట్ సార్'గా పేరుగాంచిన సంకల్ప విద్యాపీఠ్ చైర్మన్ శ్రీ ధన్ శెట్టిని సన్మానించి, గత 20 ఏళ్లుగా ఆయన క్రమం తప్పకుండా హెల్మెట్ ధరిస్తున్న తీరును ఆదర్శంగా చూపిస్తూ వాహనదారులకు అవగాహన కల్పించారు.

బషీరాబాద్, బంట్వారం, మార్పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎస్ఐలు తమ సిబ్బందితో కలిసి రోడ్డు భద్రతా నియమాలు, గోల్డెన్ అవర్ ప్రాధాన్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై వాహనదారులకు వివరించారు. ముఖ్యంగా స్కూల్ బస్సులు ప్యాసింజర్ ఆటోల డాక్యుమెంట్లను తనిఖీ చేస్తూ, సురక్షిత ప్రయాణంపై కౌన్సెలింగ్ నిర్వహించారు. తాండూర్ టౌన్ ఇన్ స్పెక్టర్ ఆధ్వర్యంలో పాఠశాల బస్సు డ్రైవర్లకు ప్రత్యేక సెన్సిటైజేషన్ సెషన్ నిర్వహించి, బస్సులలో ప్రథమ చికిత్స కిట్లు, స్పీడ్ గవర్నర్లు ఫిట్ నెస్ సర్టిఫికెట్ల లభ్యతను నిశితంగా పరిశీలించారు. చిన్నారుల రవాణాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా బొంరాస్‌పేట్, ధరూర్, కోడంగల్ (NH 163), దౌల్తాబాద్ ప్రాంతాల్లో ఎస్ఐల నేతృత్వంలో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దుద్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్లు ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించగా, చెంగోముల్ మరియు కుల్కచర్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో పాఠశాల విద్యార్థులకు రోడ్డు దాటే విధానం జీబ్రా క్రాసింగ్ ప్రాధాన్యతను వివరించారు. పాఠశాల పరిసరాలను 'సురక్షిత పాఠశాల మండలాలు'గా మారుస్తూ, వేగ నియంత్రణ బోర్డులు జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సంధార్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలందరూ ఈ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు సహకరించాలని తెలియజేయడం జరిగింది.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**బ్యాంకు మేనేజర్ సురేష్..**



**నేటి సాక్షి ,పాములపాడు:** పాములపాడు మండల కేంద్రంలో ఈరోజు జరిగిన స్థానిక మండల వెలుగు కార్యాలయం నందు వివోఏలకు మరియు పొదుపు మహిళలకు రుణ మరియు జీవనోపాదుల ప్రణాళిక కు సంబంధించి కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఏపీఎం ఉమామహేశ్వరి మాట్లాడుతూమహిళలు ఆర్థికంగా ఎదిగి ప్రతి ఇంట్లో ఒక జీవనోపాధిని పెట్టుకునే విధంగా అవగాహన కల్పించడం జరిగినదన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా శ్రీనిధి ఉన్నతి ద్వారా రుణము తీసుకొని మహిళల ఆర్థికంగా డెవలప్ కావాలన్నారు సర్ఫ్. ఐబీ కి సంబంధించి అదనపు సహాయకులైనటువంటి శ్రీధర్ రావు మరియు బ్యాంకు లింకేజీ డిపిఎం ఇన్స్టిట్యూషన్ బిల్డింగ్ డిపిఎం నాయక ఈరోజు జరిగిన ట్రైనింగులో సలహాలు ఇవ్వడం జరిగినదన్నారు అదేవిధంగా యూనియన్ బ్యాంక్ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ బ్యాంకులో చేసుకోవాలని సూచించారు

## కోరుట్లలో 'జీరో టాలరెన్స్ డే'

**వాహనదారులకు అవగాహన**



**నేటి సాక్షి,కోరుట్ల(రాధారపు నర్సయ్య):** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్–అలైవ్' కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణంలో శనివారం 'జీరో టాలరెన్స్ డే' నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోరుట్ల ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చని తెలిపారు. జీరో టాలరెన్స్ విధానంలో భాగంగా ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఎలాంటి రాజీ ఉండదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని, సురక్షిత ప్రయాణం కోసం వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు వాహనదారులు పాల్గొన్నారు.

## కళాకారుల సంఘం అండ

**అంకాలమ్మ కుటుంబానికి రూ. 5 వేల సాయం**



**నేటి సాక్షి,పాములపాడు:** పాములపాడు మండలంలోని పెంచికలపల్లె గ్రామానికి చెందిన భజన కళాకారిణి యాండ్ల అంకాలమ్మ ఆకస్మిక మరణం పట్ల అఖిల భారత ప్రాచీన తెలుగు జానపద వృత్తి కళాకారుల సంఘం సంతాపం వ్యక్తం చేసింది. శనివారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించిన సంఘం నాయకులు, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భజన కళాకారుల సహాయనిధి ప్రాజెక్టులో అంకాలమ్మ సభ్యురాలిగా ఉన్నందున, ఆమె మరణాంతరం కుటుంబానికి సంఘం తరపున రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు నాగేష్ నాయకత్వంలో, మండల అధ్యక్షుడు మరియు బృందం లీడర్ బి. నాగలింగయ్య ద్వారా ఈ మొత్తాన్ని బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు పులిమామిడి యాదగిరి మాట్లాడుతూ.. గ్రామాలలో భజన సంస్కృతిని కాపాడటానికి, ఆధ్యాత్మిక ధర్మప్రచారాన్ని పెంచడానికి తమ సంఘం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కళాకారులు ఇలాంటి సహాయనిధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జనగణన శిక్షణా కార్యక్రమం



**నేటి సాక్షి, మునగాల:** దేశవ్యాప్తంగా 2026, 2027 సంవత్సరాల్లో రెండు దశల్లో నిర్వహించనున్న జనగణన సర్వేకు సంబంధించి మండల స్థాయిలో ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. ఈ నేపథ్యంలో మునగాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనగణన సర్వే బృందానికి శిక్షణా కార్యక్రమాన్ని తహసీల్దార్ సరిత శనివారం ప్రారంభించారు. మండల వ్యాప్తంగా సర్వే నిర్వహించనున్న సిబ్బందికి ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. తొలి విడత శిక్షణ శిబిరంలో 45 మంది సిబ్బంది పాల్గొన్నారు. రెండవ విడత శిక్షణ శిబిరం బుధవారం నుంచి ప్రారంభం కానుండగా, అందులో 44 మంది పాల్గొననున్నట్లు తహసీల్దార్ వివరించారు. ఈ శిక్షణలో జనగణన ప్రక్రియ, డేటా సేకరణ విధానం, గృహాల గుర్తింపు, డిజిటల్ నమోదు వంటి అంశాలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ దిన్ దయాల్, ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు, ఆర్ఐ రామారావు, ట్రైనర్లు ఎన్. కోటేశ్వరరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు కల్తీ ఎరువులు అరికట్టాలి




- రైతులకు సబ్సిడీ విత్తనాలు,ఎరువులు మందులు అందించాలి.
- జిల్లా రైతు సంఘం మహాసభ డిమాండ్.

**నేటి సాక్షి వికారాబాద్ :** తెలంగాణ రైతు సంఘం జిల్లా జనరల్ బాడీ, మహాసభ వికారాబాద్ క్లబ్ ఫంక్షన్ హాల్ లో ఆర్ మహిపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమనికి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి పాల్గొని మాట్లాడుతూ...దేశంలో బీజేపీ మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతాంగానికి కష్టం వచ్చి పడింది అన్నారు. ఓట్లు వేసి గెలిపించిన రైతులకు కూలీలకు వ్యతిరేకంగా జీవోలు తీసుకొచ్చి ఇబ్బందులు పెడుతూ, బడా పెట్టుబడి దారులకు అంబానీ ఆదానీలకు ఉడుగం చేస్తుంది అన్నారు. దేశంలో ఉన్న వ్యవసాయం మార్కెట్లను, పరిశ్రమ రంగాలను మొత్తం అంబానీ ఆదానిలకు కట్టబెడుతుంది. రాబోయే కాలంలో రైతన్నకి కార్మిక వర్గానికి అనుకూలమైన జీవోలు తీసుకురావాలని, మార్కెట్లు పరిశ్రమలు బ్యాంకులు ప్రవేట్కరణ ఆపాలని, రైతాంగానికి ఉచిత విద్యుత్తు రైతు రుణాలు మాకు చేయాలని, అందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వ భూములు పేదలకు రైతులకు పంచాలని, రైతులు పండించిన పంటలకు ఇన్సూరెన్స్ ప్రమాద బీమా పంటల బీమా పంటలకు బోనస్ ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతన్నకి ఇచ్చిన హామీలు అమలు చేయాలని మార్కెట్లో రైతులకు ఎరువులు మందులు సబ్సిడీలు ఇచ్చే విధంగా చూడాలని కల్తీ మందులు అరికట్టాలని ప్రభుత్వాలకు డిమాండ్ చేస్తున్నాము అన్నారు రాబోయే కాలంలో రైతులకు నష్టదకంగా తీసుకొస్తున్న జీవోలకు వ్యతిరేకంగా పాలకులపై పోరాడేందుకు సిద్ధం కావాలని అన్నారు అనంతరం తెలంగాణ రైతు సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా మదనపల్లి సుదర్శన్ కార్యదర్శిగా ఆర్ మహిపాల్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ నర్సింలు వెంకటరామ్ సహకార దర్శినిగా నరసమ్మ మానేయ ఎన్ నర్సింలు కమిటీ సభ్యులుగా మోహన్ రాజు కవిత మల్లయ్య జంగయ్య, సభలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి అనసూయ, డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా 'టాస్' పరీక్షలు నిర్వహించాలి

**జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



**నేటి సాక్షి,వికారాబాద్ :** ఈ నెల 20వ తేదీ నుండి 27వ తేదీ వరకు నిర్వహించనున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆమె పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి వికారాబాద్ టౌన్‌లో రెండు ఎస్ఎస్సీ మరియు రెండు ఇంటర్మీడియట్ కేంద్రాలు, అలాగే తాండూరు టౌన్‌లో ఒక ఎస్ఎస్సీ మరియు రెండు ఇంటర్మీడియట్ కేంద్రాలను కేటాయించినట్లు ఎస్పీ వివరించారు. పరీక్షలు జరిగే అన్ని కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత ఎస్.హెచ్.ఓలు మరియు ఇన్‌స్పెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. పరీక్షల సమయంలో కాపీయింగ్ వంటి అక్రమాలకు తావులేకుండా పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసరాలలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు, నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసుకోవాలని, బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని ఎస్పీ స్నేహ మెహ్రా ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# సీఐ నాపై దాడి చేశారు





- డీఎస్పీకి సోషల్ వర్కర్ నాగరాజు ఫిర్యాదు

**నేటి సాక్షి,పాములపాడు :** ఒక కేసు విషయంలో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తనపై రూరల్ సీఐ దాడి చేశారని సోషల్ వర్కర్ కలబండి నాగరాజు ఆత్మకూరు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. శనివారం పాములపాడు పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితుడు నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక కేసు నిమిత్తం తనను పాములపాడు స్టేషన్‌కు పిలిపించగా, తనకు 41 సెక్షన్ కింద నోటీసు ఇచ్చి పిలవాలని కోరినందుకు రూరల్ సీఐ ఎం. సురేష్ కుమార్ రెడ్డి తనపై దాడి చేశారని ఆరోపించారు. సీఐ దాడి చేయడంతో శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది కలగగా, కుటుంబ సభ్యులు తక్షణమే 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ఆక్సిజన్ సౌకర్యం లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు బాధితుడు పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం, నాగరాజు సమత సైనిక్ దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు సగినాల సురేష్ మరియు ఇతర ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆత్మకూరు డీఎస్పీ ఆర్. రామాంజీ నాయక్ ను కలిసి ఫిర్యాదు చేశారు. తనపై దాడి చేసిన సీఐపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**నేటి సాక్షి,సూర్యాపేట:** తహసిల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం '99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నూతనకల్ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. సాదా బైనమా దరఖాస్తుల క్రమబద్ధీకరణలో పారదర్శకత పాటించాలని, భూభారతి చట్టం–2025 నిబంధనల ప్రకారం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే సర్వే & సరిహద్దుల చట్టం–1923 ప్రకారం మండలంలోని తొమ్మిది గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీలింగ్ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాల మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన శ్రీరామ ఎల్లమ్మ సమస్యను కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కరించారు. 2020 నుండి పెండింగ్‌లో ఉన్న ఆమె సాదా బైనమా ఫైలును వెంటనే ఆన్‌లైన్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI


# బయ్యన్నగూడ గుట్టలో అక్రమ మట్టి తవ్వకాలు నిలిపివేయాలి



**నేటి సాక్షి,శంకర్‌పల్లి:** శంకర్ పల్లి మండలం మహాలింగాపురం అనుబంధ గ్రామమైన బయ్యన్నగూడ గుట్ట నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు శనివారం స్థానిక తహసిల్దార్ సురేందర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. బయ్యన్నగూడలోని సర్వే నెంబర్ 14లో ఉన్న గుట్టపై పురాతన బయ్యన్నదేవుడు (కాలభైరవుడు), భూ లక్ష్మమ్మ దేవాలయాలు ఉన్నాయని తెలిపారు. అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతుండటంతో దేవాలయాలకు వెళ్లే దారి పూర్తిగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన ఆమ్రపాలి ఈ గుట్టను సందర్శించి, మట్టి తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించినట్లు వారు గుర్తు చేశారు. అధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ అక్రమార్కులు తమ పనిని కొనసాగిస్తున్నారని, దీనివల్ల ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన గుట్ట రూపురేఖలు మారిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన తహసిల్దార్ సురేందర్.. అక్రమ తవ్వకాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బయ్యన్నగూడ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైకోర్టు జడ్జిని కలిసిన ధర్మపురి లాయర్లు

**శాశ్వత కోర్టు భవనం ఏర్పాటు చేయాలని వినతి**




**నేటి సాక్షి, ఎండపల్లి:** జగిత్యాల జిల్లా కోరుట్లలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవ హైకోర్టు న్యాయమూర్తి శ్రీమతి రేణుక యారాను ధర్మపురి న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మపురి బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామడుగు రాజేష్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇమ్మడి శ్రీనివాస్, ఐఎల్‌పీఏ జిల్లా కార్యదర్శి జాజాల రమేష్, న్యాయవాది బత్తిని ఇంద్రకరణ్ కలిసి న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కోరుట్లలో నూతన కోర్టు ప్రారంభం ప్రజలకు న్యాయ సేవలు మరింత సులభంగా అందించేందుకు దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధర్మపురిలో శాశ్వత కోర్టు భవనం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని న్యాయవాదులు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం తాత్కాలిక వసతులతోనే న్యాయ సేవలు అందిస్తున్న పరిస్థితుల్లో, శాశ్వత భవనం ఏర్పాటుతో ప్రజలకు, న్యాయవాదులకు సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రం సమర్పించారు.

# న్యాయ సేవల విస్తరణకు కొత్త అడుగు




- **కోరుట్లలో కోర్టును ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి రెణుక యేరా**

**నేటి సాక్షి,కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఘనంగా ప్రారంభించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జగిత్యాల జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రేణుక యేరా హాజరై కోర్టును ప్రారంభించారు. కార్యక్రమం న్యాయ వర్గాలకు ప్రత్యేక ఉత్సాహాన్ని తీసుకువచ్చింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన జిల్లా సెషన్స్ జడ్జి సి. రత్న పద్మావతి, మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి సునీత రవీంద్ర రెడ్డి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న న్యాయమూర్తులు పాల్గొన్నారు. కోరుట్ల, జగిత్యాల, మెట్ పల్లి, ధర్మపురి బార్ అసోసియేషన్ల అధ్యక్షులు, సభ్యులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.కోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా సంప్రదాయబద్ధంగా దీపప్రజ్వలన నిర్వహించగా, విద్యార్థులు స్వాగత గీతంతో అతిథులను ఆహ్వానించారు. అనంతరం గౌరవ అతిథుల ప్రసంగాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా మాట్లాడిన జస్టిస్ రేణుక యేరా, న్యాయ సేవల విస్తరణతో పాటు ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. కోర్టుల విస్తరణ ద్వారా పెండింగ్ కేసులను తగ్గించడంతో పాటు ప్రజలకు చేరువలో న్యాయం అందించవచ్చని ఆమె వివరించారు. కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అంజనేయులు మాట్లాడుతూ, ఈ అదనపు కోర్టు ఏర్పాటు వల్ల పెండింగ్ కేసుల భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ కోర్టుకు శాశ్వత న్యాయమూర్తిని నియమించాలని ఆయన వినయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. కోరుట్లలో నిర్మాణంలో ఉన్న నూతన కోర్టు భవనం ఆగస్టు నెలలో పూర్తి కానుందని, త్వరలోనే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో ఆ భవనం ప్రారంభం జరగనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ప్రాంతీయ న్యాయ వ్యవస్థ అభివృద్ధికి మరింత బలం చేకూరుస్తుందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో కోరుట్ల బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుతారి శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు అంబల్ల నాగ నిర్మల, క్యాషియర్ చింతకింది ప్రేమ్ కుమార్, సంయుక్త కార్యదర్శి కె. దినేష్ కుమార్, సాంస్కృతిక కార్యదర్శులు ఎం.డి. ఫసియొద్దీన్, దురిశెట్టి శివకుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు తొకల రమేష్, ఆడెపు వినోద్ కుమార్, చిలివేరి రాజశేఖర్, చాప వందన, రాచకొండ రోజా తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎగ్జిక్యూటివ్ సభ్యులు రాసబక్తుల రాజశేఖర్, సయ్యద్ అనసుద్దీన్, చిట్యాల శివకుమార్, కుందారపు వివేక్, తీగుల్ల శ్రావణి, మోర్తాడ ఉమ, ఏజీపీ గోనే రాజేష్ ఖన్నా, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ కస్తూరి రమేష్, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు కూడా పాల్గొన్నారు.

# కేసీఆర్ బయటకు వస్తే గుంట నక్కలకు భయం

**జగిత్యాలలో కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు**



**నేటి సాక్షి ,జగిత్యాల (రాధారపు నర్సయ్య):** జగిత్యాల వేదికగా తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్న తరుణంలో పట్టణంలో గులాబీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చి పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాజకీయ పునరేకీకరణ జరుగుతోందని, కేసీఆర్ ప్రజల్లోకి వస్తుంటే ప్రత్యర్థులైన గుంట నక్కలకు భయం పట్టుకుందని ఆయన ఎద్దేవా చేశారు. కేసీఆర్ సభకు పోటీగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడిగడ్డలో సభ పెట్టడమే వారి భయానికి నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అంచనాలను అందుకోలేకపోయిందని, ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి కారణంగానే మళ్లీ రాజకీయ సమీకరణాలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారుతున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ, గతంలో తాను రేవంత్‌ను ఎత్తులో చిన్నవాడని అనుకున్నానని, కానీ ఇప్పుడు ఆయనది చిన్న మెదడు అని అర్థమవుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. జగిత్యాల ఎమ్మెల్యే తీరుపై కూడా వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ, ఆయన హైబ్రిడ్ ఎమ్మెల్యేనో లేక క్రాస్ బ్రీడ్ ఎమ్మెల్యేనో తెలియడం లేదన్నారు. రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడే వారు గోడలు దూకడాన్ని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. జగిత్యాల గడ్డ నుంచే బీఆర్ఎస్ పార్టీ జైత్రయాత్ర ప్రారంభమవుతుందని, రాబోయే రోజుల్లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్ఎస్ ఎదుగుదలను ఆపలేదని, కార్యకర్తలు మరింత కష్టపడి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 20న జగిత్యాలలోని వివేకానంద మినీ స్టేడియంలో జరిగే కేసీఆర్ బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 5:30 గంటలకు కేసీఆర్ సభకు చేరుకుని, సుమారు గంటసేపు కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ సభలోనే సీనియర్ నేత జీవన్ రెడ్డి అధికారికంగా బీఆర్ఎస్‌లో చేరనున్నారు. సభా ఏర్పాట్లను కేటీఆర్, హరీశ్ రావు, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కలిసి నిశితంగా పరిశీలించారు. సభను అడ్డుకోవడానికి ప్రభుత్వం రోడ్లు తవ్వడం వంటి చర్యలకు పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. అయినప్పటికీ ప్రజలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సభ తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారుతుందని పార్టీ నాయకులు భావిస్తున్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**అర్బన్ సిడిపిఓ మమత ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ**



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** చట్టప్రకారం బాల్యవివాహాలు నేరం అని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్ మరియు జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు శనివారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ చేతుల మీదుగా ఐసిడియస్ మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ సిడిపిఓ రేఖల మమత ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, చిన్నారుల అక్రమ దత్తత మరియు ఫోక్సో చట్టాల వివరాలపై పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చట్టాల ప్రకారం ప్రభుత్వం చిన్నారులను అక్రమ దత్తత చేయడం నేరం అని అన్నారు. మైనర్లకు పొక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ దామచర్ల ప్రాజెక్ట్ సీడీపీఓ ఎన్ చంద్రకళ, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ అధికారులు వెంకన్న, రమణి, మహేష్, సూపర్వైజర్స్ హేమా దేవి, నాగమణి, వాణి, పోషణ అభియాన్ బ్లాక్ కో–ఆర్డినేటర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

# సంగుపట్ల నియామకం



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీకి చెందిన సంగుపట్ల మల్లేశం నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల మహేందర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వంతడుపుల సంపత్ చేతులమీదుగా మల్లేశం నియామక పత్రం అందుకున్నారు. అంబేద్కర్ ఆలోచన విధానం గ్రామస్థాయిలో ప్రతి వ్యక్తికి, ప్రతి గడపకు చేరే విధంగా కృషి చేస్తానని మల్లేశం తెలిపారు.

# శంకర్ పల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఘన సన్మానం



**నేటి సాక్షి,శంకర్ పల్లి :** శంకర్ పల్లి పట్టణంలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను మండల విద్యాధికారి (ఎంఈఓ) సయ్యద్ అక్బర్ శనివారం పాఠశాల ఆవరణలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇంటర్ రెండో సంవత్సరంలో జె. భార్గవి (961/1000), జి. మౌనిక (930/1000), మన్మిత (900/1000), మధుసూదన్ (852/1000) మరియు 812 మార్కులు సాధించిన విద్యార్థులకు, అలాగే ప్రథమ సంవత్సరంలో ప్రతిభ చాటిన దీపిక (462/500), స్పందన (409/500)లను ఎంఈఓ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**నేటి సాక్షి:** మంత్రాలయం ఆపదలో ఉన్న 34 కుటుంబాలకు ఆర్థిక అండగా మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. శనివారం ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 9,92,314 విలువైన చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. మండలాల వారీగా కోసిగి మండలానికి చెందిన 14 మంది, కౌతాళం మండలానికి 12 మంది, మంత్రాలయం మండలానికి ముగ్గురు, పెద్దకడుబూరు మండలానికి ఐదుగురు ఈ సహాయం పొందారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ, సీఎం సహాయనిధి ద్వారా పేద మరియు బాధిత కుటుంబాలకు తక్షణ ఉపశమనం లభిస్తోందని పేర్కొన్నారు. ప్రజల కష్టాలను తమవిగా భావిస్తూ అవసరమైన సమయంలో సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం ఆదర్శనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

TGTEL/25/A1737 | NETI SAKSHI

# హెడ్ మాస్టర్ రాజమౌళి పదవీ విరమణ





**నేటి సాక్షి:** కోసిగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దీర్ఘకాలంగా హెడ్ మాస్టర్‌గా సేవలందించిన రాజమౌళి పదవీ విరమణ సందర్భంగా భావోద్వేగభరితంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హాజరై ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యా రంగంలో రాజమౌళి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, నాణ్యమైన బోధనా పద్ధతులతో ఆయన అనేకమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని ప్రశంసించారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా సేవగా భావించి పనిచేసిన ఆదర్శ గురువుగా ఆయన నిలిచారని పేర్కొన్నారు. తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు రాజమౌళిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, ఆయనకు వీడ్కోలు పలికారు. తన సేవా కాలంలో పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ, ఆయనతో ఉన్న అనుబంధాన్ని భావోద్వేగంతో నెమరువేసుకున్నారు. రాజమౌళి మార్గదర్శకత్వంలో పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు, విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలపై అవగాహన పెరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఆయన చూపిన దారిలోనే ముందుకు సాగుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ పెద్దలు, విద్యా శాఖ అధికారులు పాల్గొని రాజమౌళి సేవలను స్మరించుకున్నారు.

# స్వర్ణాంధ్ర లక్ష్యం స్వచ్ఛ ఆంధ్ర దిశ

### జల భద్రతే భవిష్యత్తు




**నేటి సాక్షి:** పెద్దకడుబూరు మండలం చిన్నతుంబలం గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి పాల్గొని గ్రామ ప్రజలకు పరిశుభ్రత, జల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి జల సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. "నీటిని కాపాడితేనే భవిష్యత్తు బలపడుతుంది. ప్రతి ఇంటి నుంచే జల సంరక్షణ ప్రారంభమై ప్రజా ఉద్యమంగా మారాలి" అని ఆయన పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన గ్రామం సుస్థిర అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, చెరువుల పూడికతీత, కాలువల శుభ్రత, భూగర్భ జలాల పెంపు వంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరవ రమాకాంత్ రెడ్డి, బసలదొడ్డి ఈరన్న, సురేష్ నాయుడు, గోపాల్ రెడ్డి, మల్లికార్జున, చిన్నతుంబలం నర్సప్ప, నీటి సంఘం అధ్యక్షులు నారాయణ, ఆంజనేయ, ఎల్ఎల్‌సీ ఈఈ సైలేష్ రెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనగణన 2027

### విజయవంతంగా పూర్తి చేయాలి



**నేటి సాక్షి, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో జనగణన 2027కు ఎన్యుమ రేటర్లు సూపర్వైజర్లు సమర్థవంతంగా పూర్తి చేయాలని కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ అన్నారు చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జనగణన మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు చిలుకూరు మండలంలో జనగణన సర్వే చేసేందుకు 71 మంది ఎన్యుమ రేటర్లు 11 మంది సూపర్వైజర్లు ను నియమించినట్టుగా ఆయన తెలిపారు. రెండు విడతల్లో జనగణన సర్వే చేసేందుకు ఎన్యుమ రేటర్లు సూపర్వైజర్లు కు శిక్షణ ఇవ్వనున్నట్లుగా తెలిపారు నిబంధనల మేరకు శిక్షణలో నేర్చుకున్న విధముగా జనగణన సర్వే చేయాలని సూచించారు ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ధ్రువ కుమార్ ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారాం ఆర్ఐ లు. మంత్రి ప్రగడ సీతా రామచంద్ర రావు శ్వేత ఎంపీ హెచ్ ఓ ప్రవీణ్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ధర్నా

### జాతీయ రహదారిపై బైఠాయింపు



**నేటిసాక్షి,తిరుమలాయపాలెం(రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో మొక్కజొన్న పంటకు కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో తెట్టెలపాడు క్రాస్ రోడ్డు వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ స్థానిక రైతులు శనివారం రోడ్డుపై నిరసన తెలిపారు వ్యవసాయ శాఖ ప్రోత్సాహంతో ఆరువేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినప్పటికీ పంటకు సరైన ధర దక్కకపోవడం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు పంట పండితే కొనుగోలు చేసే నాధుడు లేకుండా పోయింది అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకుడు బిల్లంగిరి ధనుంజయ్ మాట్లాడుతూ రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని మండిపడ్డారు వ్యవసాయ శాఖ ప్రోత్సాహంతో పత్తి సాగు చేసిన తర్వాత ప్రత్యామ్ న్యాయ పంటగా వ్యవసాయ శాఖ సూచనల మేరకు పదివేల ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేసినారు కానీ సాగు చేసిన పంట కనీస మద్దతు ధర కూడా అందకపోవడం కనీస కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని విమర్శించారు ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు బిల్లంగిరి ధనుంజయ్ రైతులు రెడ్డి మల్ల నరేందర్ గుడిపూడి వెంకటనారాయణ దొడ్డ గురవయ్య జక్కుల వీరన్న పాల్గొన్నారు

# సూర్యాపేటలో వృద్ధురాలి హత్య

### నగలు అపహరణ



**నేటి సాక్షి,సూర్యాపేట:** జిల్లా కేంద్రంలోని 28వ వార్డు జై జై నగర్‌లో గుర్తుతెలియని దుండగులు ఇరుగు పాపమ్మ అనే వృద్ధురాలిని దారుణంగా హత్య చేశారు. శబరి మిల్క్ సెంటర్ వెనుక నివసిస్తున్న ఆమెను హతమార్చి, ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్సైలు ఐలయ్య, ఏడుకొండలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించగా, పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలకే కార్పొరేట్ స్థాయి తీరు

### చందూరి రాజిరెడ్డి సేవలకు ప్రశంసల వెల్లువ



**నేటి సాక్షి, ఎండపల్లి:** ప్రభుత్వ పాఠశాలలో అంకితభావంతో సేవలందిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో విశేష ప్రతిభ కనబరిచిన గుల్లకోట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చందూరి రాజిరెడ్డి రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. పాఠశాలను దాతల సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడంతో పాటు, విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించి, కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా అందమైన యూనిఫామ్‌లు, వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున విద్యార్థులను పాఠశాలలో నమోదు చేయించడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన ఆదర్శవంతమైన పనితీరుతో గుల్లకోట ప్రాథమిక పాఠశాలను రాష్ట్రంలోనే ఉత్తమ పాఠశాలలలో ఒకటిగా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ నుంచి ప్రశంసలు, సన్మానం పొందారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ధర్మపురి నియోజకవర్గ స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ రాజిరెడ్డి సేవలను ప్రశంసించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి కే. రాము, ఎండపల్లి మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

# అప్పుడు చెల్లని రూపాయి ఇప్పుడెలా చెల్లుతుంది

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ సభపై గందరగోళం
- ఇది జీవన్ రెడ్డి చేరిక కార్యక్రమమా.? బిఆర్ఎస్ బహిరంగ సభనా స్పష్టత ఇవ్వాలని డిమాండ్



**నేటి సాక్షి, జగిత్యాల (రాధారపు నర్సయ్య):** జగిత్యాలలో నిర్వహించనున్న కార్యక్రమంపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. ఇది బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభనా.? లేక జీవన్ రెడ్డి చేరిక కార్యక్రమమా.? అన్నది అర్థం కావడం లేదని విమర్శించారు. ఈ విషయంలో కేటీఆర్, హరీష్ రావు ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు నందయ్యతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. చేరిక కార్యక్రమం మాత్రమే అయితే బహిరంగ సభలా ఎందుకు నిర్వహిస్తున్నారో వివరించాలని మంత్రి ప్రశ్నించారు. నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జీలను నియమించి రాష్ట్రవ్యాప్తంగా నాయకులను తరలించడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో చెప్పాలని అన్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల నుంచి నాయకులను తీసుకువచ్చి సభ నిర్వహించుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సభల నిర్వహణపై ఎలాంటి ఆంక్షలు విధించదని మంత్రి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో మాత్రం మంత్రులు వస్తే అక్రమ అరెస్టులు, పరిమితులు విధించేవారని ఆరోపించారు. ప్రస్తుతం మీ సభకు అవసరమైన అన్ని అనుమతులు నిబంధనల ప్రకారం ఇవ్వాలని తానే స్వయంగా కలెక్టర్‌కు సూచించినట్లు తెలిపారు. జీవన్ రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి ఉంటే పార్టీని వీడేవారా అని మంత్రి ప్రశ్నించారు. రాజ్యసభ సీటు లేదా ప్రభుత్వ సలహాదారు పదవి ఇచ్చినా ఆయన పార్టీలోనే కొనసాగేవారని అన్నారు. పదవులు రాకపోవడంతోనే బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆరోపించారు. 40 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులు అనుభవించిన వ్యక్తి ఇప్పుడు అదే ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరైన రాజకీయ నైతికత కాదని మంత్రి పేర్కొన్నారు. గతంలో కేసీఆర్, కేటీఆర్‌లను తీవ్రంగా విమర్శించిన జీవన్ రెడ్డి ఇప్పుడు వారినే ప్రశంసించడం విచిత్రంగా ఉందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్న వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. అదే నిజమైతే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఎందుకు మద్దతిచ్చారో ప్రశ్నించారు. అనంతరం జరిగిన పార్లమెంట్, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. రాష్ట్ర ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని, నిజమైన అభివృద్ధి, సంక్షేమం ఎక్కడుందో వారికి తెలుసని మంత్రి పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు జరిగినా రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# కల్లుకుంటలో సీసీరోడ్డు వివాదానికి పరిష్కారం

### రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి





**నేటి సాక్షి:** పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి నెలకొన్న వివాదాలను రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి సర్దుబాటు చేశారు. శనివారం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించే సమయంలో భూ సరిహద్దులు, రహదారి మార్గంపై స్థానికుల మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తి ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చేరుకున్న టీడీపీ నేత నరవ రమాకాంత్ రెడ్డి ఇరువర్గాల అభిప్రాయాలను శాంతంగా విని సమస్యను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో చర్చించి గ్రామ ప్రజలందరికీ అనుకూలంగా ఉండే విధంగా మార్గాన్ని సర్దుబాటు చేస్తూ పరిష్కారం చూపించారు. ఆయన జోక్యంతో వివాదం శాంతియుతంగా ముగియడంతో గ్రామంలో ఉద్రిక్తత తొలగి సానుకూల వాతావరణం నెలకొంది. గ్రామ అభివృద్ధి పనుల్లో ప్రజల సహకారం అత్యవసరమని, ఏ సమస్య వచ్చినా పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ పరిష్కారంపై గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.